ఈ ఏడాదీ ఏం మారలే!

పూర్తి కాని జనగామ మెడికల్ కళాశాల నిర్మాణం

తాత్కాలిక షెడ్లలోనే వైద్య తరగతులు

ఇంకా పిల్లర్ల దశలోనే భవనం పనులు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం

వసతుల కల్పనపై గతంలో ఎన్ఎంసీ జరిమానా

అయినప్పటికీ పనుల్లో కనిపించని వేగం



పిల్లర్ల దశలోనే ఉన్న జనగామ మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు

జనగామ, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది జనగామ మెడికల్ కాలేజీ నిర్మాణ పనుల్లో ఏ మార్పు లేదు. ఆగుతూ సాగుతూ జరుగుతుండటంతో తాత్కాలిక షెడ్లలోనే తరగతులు నిర్వహించాల్సిన దుస్థితి. పనులు వేగవంతం చేయడంలో అధికారులు అలసత్వం వీడడం లేదు. కాలేజీ నిర్మాణ పనులు మొదలుపెట్టి ఏడాది అవుతున్నా ఇంకా పిల్లర్ల దశలోనే ఉన్నాయి. జనగామ మెడికల్ కాలేజీని ఎన్ఎంసీ గత ఏడాది 100 సీట్లతో అనుమతిని ఇచ్చింది. దీంతో గత సెప్టెంబరు 15న అప్పటి సీఎం కేసీఆర్ చేతుల మీదుగా మెడికల్ కాలేజీని వర్చువల్‌గా ప్రారంభించారు. ఎన్ఎంసీ అనుమతి ఇవ్వడంతో రూ. 20 కోట్లతో తాత్కాలికంగా షెడ్ల నిర్మాణం చేపట్టి తరగతులను ప్రారంభించారు. అదే క్రమంలో శాశ్వత భవనాల నిర్మాణాలను ప్రారంభించారు. కాగా.. కాలేజీ ప్రారంభమై మొదటి సంవత్సరం ముగుస్తున్నా శాశ్వత భవనాల నిర్మాణం మాత్రం పూర్తి కాలేదు. దీంతో రెండో ఏడాది విద్యార్థులు, త్వరలో కౌన్సిలింగ్ ద్వారా రాబోయే మొదటి సంవత్సరం విద్యార్థులకు గతేడాది మాదిరిగానే తాత్కాలిక షెడ్లలోనే తరగతులు నిర్వహించనున్నారు.

పిల్లర్ల దశలోనే పనులు

జనగామ మెడికల్ కాలేజీ, విద్యార్థుల హాస్టళ్ల భవనాల నిర్మాణాలను రూ. 190 కోట్లతో చేపట్టారు. జిల్లాకేంద్రంలోని సిద్దిపేట రోడ్డులో ఉన్న 18.23 ఎకరాల హౌజింగ్ బోర్డు స్థలాన్ని మెడికల్ కాలేజీ కోసం అప్పటి ప్రభుత్వం కేటాయించింది. పనులు ప్రారంభమై దాదాపు ఏడాది గడుస్తున్నా పనులు మాత్రం ఇంకా పిల్లర్ల దశలోనే ఉన్నాయి. జనగామ మెడికల్ కాలేజీలో సెకండియర్ నిర్వహణకు మరో 100 సీట్లకు అనుమతినిస్తూ మే నెలలో నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) నిర్ణయం తీసుకుంది. ఇందులో భాగంగా అక్టోబరు నెలలో ఎంబీబీఎస్ కౌన్సిలింగ్ ప్రక్రియ పూర్తయి మొదటి సంవత్సరం విద్యార్థులు రానున్నారు. దీనికి మరో రెండు నెలలు మాత్రమే సమయం ఉంది. ఈ లోగా పనులు పూర్తయ్యే అవకాశం కనిపించడం లేదు. దీంతో ఈ ఏడాది శాశ్వత భవనాల్లో కాలేజీ నిర్వహణ అసాధ్యంగానే కనిపిస్తోంది.

వసతుల కల్పనపై ఎన్ఎంసీ సీరియస్

మెడికల్ కాలేజీలో వసతుల కల్పనపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) మే నెలలోనే సీరియస్ అయింది. శాశ్వత భవన నిర్మాణాలను పూర్తి చేయకపోవడంపై కాలేజీ అధికారులను ఎన్ఎంసీ వివరణ కోరింది. గతేడాది కాలేజీ ప్రారంభం సందర్భంగా వీలైనంత తొందరగా వసతులు కల్పించాలని చెప్పినా పనులు పూర్తి చేయకపోవడంపై గుర్రు అయింది. రెండు నెలల్లోపు వసతులు కల్పించుకోవాలంటూ డెడ్‌లైన్ విధించింది. కౌన్సెలింగ్ పూర్తయితే అక్టోబరు నుంచి కొత్త విద్యార్థులు వస్తారు. దీంతో ఇదివరకే ఉన్న విద్యార్థులకు, కొత్త విద్యార్థులకు వస తి కల్పించడం తలకు మించిన భారం కానుంది. ఈ నేపథ్యంలో స్పందించి నేషనల్ మెడికల్ కౌన్సిల్ రెం డు నెలల్లోగా వసతులను కల్పించుకోవాలంటూ సమయం ఇచ్చింది. దీంతో పాటు సకాలంలో వసతులు కల్పించనందుకు రూ.2లక్షల జరిమానాను విధిస్తూ నిర్ణయం తీసుకుంది. రెండు నెలల తర్వాత రీఅసెస్‌మెంట్ నిర్వహిస్తామని, అప్పటికీ వసతులు సమకూర్చకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. కాగా.. ఎన్ఎంసీ ఇచ్చిన డెడ్‌లైన్ కూడా ముగిసింది. దీంతో ఎన్ఎంసీ అధికారులు మరోసారి రీఅసెస్ మెంట్ చేసి కాలేజీ నిర్మాణ పనుల అలసత్వంపై సీరియస్ అయ్యే అవకాశాలు ఉన్నాయి. అయినప్పటికీ పనుల్లో మాత్రం వేగం కనిపించడం లేదు.



ప్రస్తుతం మెడికల్ కాలేజీ తరగతులు కొనసాగిస్తున్న తాత్కాలిక షెడ్లు

కాంట్రాక్టర్ నిర్లక్ష్యం.. అధికారుల అలసత్వం

మెడికల్ కాలేజీ నిర్మాణంలో కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యం, అధికారుల అలసత్వం మూలంగా పనులు నత్తనడకన సాగుతున్నాయన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పనులు నెమ్మదిగా జరగడంపై నేషనల్ మెడికల్ కౌన్సిల్ సీరియస్ అవుతున్నప్పటికీ అధికారులు పెద్దగా పట్టించుకోవడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. గత ఏడాది ప్రారంభమైన పనులు ఈ ఏడాది విద్యాసంవత్సరం ప్రారంభం లోగా దాదాపుగా పూర్తి కావాల్సి ఉంది. ఈ విషయంలో ఉన్నతాధికారుల అలసత్వం కూడా ఉందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. కాగా.. జనగామ మెడికల్ కాలేజీ శాశ్వత భవన నిర్మాణం విషయంలో ఇరిగేషన్ శాఖ మొదట్లో అభ్యంతరం తెలపడం వల్ల పనుల నిర్మాణంలో కొంత ఆలస్యం ఏర్పడిందని అధికారులు చెబుతున్నారు. మెడికల్ కాలేజీ నిర్మిస్తున్న స్థలం నుంచి ఇరిగేషన్ కెనాల్ ఉందంటూ నీటి పారుదల శాఖ అధికారులు నిర్మాణ పనులను మే నెలలో నిలిపివేశారని, దీంతో కొంత కాలం పనులు జరగలేదని అన్నారు. ఆ తర్వాత ఉన్నతాధికారుల చొరవతో పనులు ప్రారంభమయ్యాయని చెబుతున్నారు.

తరగతుల నిర్వహణ ఇబ్బంది లేదు



మెడికల్ కాలేజీ భవన నిర్మాణం పూర్తి కానప్పటికీ ఈ ఏడాది విద్యార్థులకు తరగతులకు ఎలాంటి ఇబ్బందులు ఎదురుకాకుండా చర్యలు తీసుకున్నాం. రెండో సంవత్సరంతో పాటు కౌన్సిలింగ్ తర్వాత రాబోయే మొదటి సంవత్సరం విద్యార్థులకు సరిపడా తరగతి గదులు ఉన్నాయి. ప్రస్తుతం బాలికలకు ధర్మకంచ బాలికల ఎస్సీ హాస్టల్‌లో, బాలురకు చంపక్‌హిల్స్‌లోని డీఆర్‌డీఏ భవనంలో హాస్టల్ వసతి కల్పించాం. కాగా.. విద్యార్థినులకు హాస్టల్ సౌకర్యం సరిపోకపోవడంతో శామీర్‌పేటలోని కోమటిరెడ్డి సుశీలమ్మ ఆశ్రమంలో హాస్టల్ వసతిని కల్పిస్తున్నాం.

-డాక్టర్ గోపాల్‌రావు, ప్రిన్సిపాల్, జనగామ మెడికల్ కాలేజీ

పీహెచ్‌సీలో డీఎంహెచ్‌వో ఆకస్మిక తనిఖీలు



పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలిస్తున్న డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ రవీందర్‌గౌడ్

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు4: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా ఇన్‌చార్జి వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ రవీందర్ గౌడ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా సిబ్బంది పనితీరుతో పాటు రికార్డుల నిర్వహణను పరిశీలించారు. సీజనల్ వ్యాధుల విషయంలో ప్రజలను చైతన్యపరచాలని, ఆసుపత్రికి వచ్చే రోగులకు సేవాభావాన్ని కనబరుస్తూ చికిత్స అందించాలని సూచించారు.

గత పాలకుల నిర్లక్ష్యంతోనే ఖజానా కష్టాలు

పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి



కళ్యాణలక్ష్మి చెక్కులను పంపిణీ చేస్తున్న యశస్విని రెడ్డి

కొడకండ్ల సెప్టెంబర్ 4: గత పాలకుల నిర్లక్ష్యపు పాలనతో రాష్ట్ర ఖజానా భారీగా దెబ్బతినడంతో తులం బంగారం ఇవ్వలేకపోతున్నామని పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని రైతువేదికలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా 81 మందికి కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను ఆమె అందజేశారు. త్వరలోనే కళ్యాణలక్ష్మితోబాటు తులం బంగారం కూడా అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రమోహన్, కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షుడు డి.సురేష్‌నాయక్, డి.రాజేష్‌నాయక్, ధర్మారం భిక్షపతి, మసురం రవీందర్, వలభోజు రమేశ్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా

కుందూరు సుధాకర్‌రెడ్డి

● నేడు సీఎం చేతుల మీదుగా అవార్డు

వివరాలు 7వ పేజీలో

జిల్లాలో 75 మంది

ఉత్తమ ఉపాధ్యాయులు

● ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా నేడు కలెక్టరేట్‌లో అవార్డుల ప్రదానం

వివరాలు 8వ పేజీలో..

యూరియా కొరత రాకుండా చూస్తున్నాం

డీఏవో రామారావు నాయక్



పీఏసీఎస్‌లోని గోదాంలో ఉన్న యూరియా, రిజిష్టర్‌లను పరిశీలిస్తున్న డీఏవో

బచ్చన్నపేట, సెప్టెంబరు 4: జిల్లాలో రైతులకు యూరియా కొరత లేకుండా చూస్తున్నామని జిల్లా వ్యవసాయాధికారి రామారావు నాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని పీఏసీఎస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేశారు. రోజువారీ అమ్మకాలకు సంబంధించిన రైతులు, బస్తాల వివరాలను ఆన్‌లైన్‌లో, రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఏమాత్రం అశ్రద్ధ వహించినా చర్యలుంటాయన్నారు. ఇప్పటి వరకు విక్రయించిన ఎరువుల వివరాలను సీఈవో బాలస్వామిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సాల్వాపూర్‌లో ఏఈవోలచే నమోదు చేస్తున్న పంటల వివరాలను పరిశీలించి పలు సూచనలు చేశారు. రుణమాఫీ దరఖాస్తుదారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏవో విద్యాకర్‌రెడ్డి, ఏఈవోలు పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో పండుగలను జరుపుకోవాలి

◆ మట్టి గణపతులను ప్రతిష్ఠించాలి ◆ నిమజ్జనం రోజు మద్యం దుకాణాలు బంద్
◆ డీజేలకు నో పర్మిషన్ ◆ కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, సెప్టెంబర్ 4: గణపతి నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ పండుగలను భక్తి శ్రద్దలతో జరుపుకోవాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, ముస్లిం శాంతి కమిటీ సభ్యులు సంబంధిత అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గణపతి ఉత్సవాల నిర్వహణ కమిటీ సభ్యులు పర్యావరణ పరిరక్షణకై మట్టి గణపతులను ప్రతిష్ఠించాలన్నారు. ఉత్సవాల నిర్వహణ ఏర్పాటు చేసేందుకు కమిటీ సభ్యులు పోలీస్, ఉచిత విద్యుత్ కోసం విద్యుత్ శాఖ అధికారులకు ముందస్తు అనుమతులు పొందాలన్నారు. ఉత్సవ కమిటీ సభ్యులకు అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. సుప్రీం కోర్టు నిబంధనల ప్రకారం ఎట్టి పరిస్థితిలో కూడా డీజేలకు అనుమతి ఇవ్వకూడదని రాత్రి పది గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు స్పీకర్లను పెట్టకూడదన్నారు. నిమజ్జనం రోజు మద్యం దుకాణాలు తెరువరాదని, ఎవరైన నిబంధనలను అతిక్రమించి మద్యం అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉత్సవాల్లో ఎటువంటి అవాంతరాలు జరుగకుండా నిర్వహకులు బాధ్యత వహించాలన్నారు. నిమజ్జనంలో పాల్గొనే గజ ఈతగాళ్లకు ఒకే రకమైన టీషర్టులను ఏర్పాటు చేయాలన్నారు. చెరువులు, కుంటలు, రిజర్వాయర్‌ల వద్ద పరిరక్షణకు సిబ్బందికి విధులు కేటాయించాలన్నారు. వైద్యశాఖ అధికారులు నిమజ్జనం రోజు హెల్త్ క్యాంపును ఏర్పాటు చేయాలని, అగ్నిమాపక, విద్యుత్ శాఖ అధికారులు అందుబాటులో ఉండాలన్నారు. గణపతి నవరాత్రి ఉత్సవాలు, మిలాద్ ఉన్ నబీ రెండు పండుగలను కలిసిమెలిసి భక్తి శ్రద్దలతో జరుపుకోవాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు పింకేష్‌కుమార్, రోహిత్‌సింగ్, డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఆర్డీవోలు కొమురయ్య, వెంకన్న, ఏసీపీలు పార్థసారధి, నర్సయ్య, భీమశర్మ, విద్యుత్ ఎస్ఈ వేణుమాధవ్, డీపీవో స్వరూప, మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

డిసెంబరు వరకు పనులు పూర్తి చేయాలి




వల్మిడిలోని రాంచంద్రస్వామి దేవాలయాన్ని సందర్శించి పరిశీలిస్తున్న కలెక్టర్

పాలకుర్తి, సెప్టెంబరు 4 : మండలంలోని పాలకుర్తి, బమ్మెర, వల్మిడి గ్రామాల్లో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు డిసెంబరు వరకు పూర్తి చేయాలని కలెక్టర్ షేక్ రిజ్వాన్‌బాషా ఆదేశించారు. బుధవారం మండలంలోని బమ్మెర గ్రామంలోని పోతన స్మారక భవనంలో పర్యాటక శాఖ అభివృద్ధి పనులపై కలెక్టర్ వివిధ శాఖల అధికారులతో పాటు రిటైర్డు ఐఏఎస్ పాపారావు, ఇంటెక్ ఛైర్మన్ ప్రొఫెసర్ పాండురంగారావుతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భాగవత గ్రంథకర్త బమ్మెర పోతన స్మారకం పేరుతో ప్రభుత్వం రూ. 7.5 కోట్లు మంజూరు చేసి పనులు చేపట్టిందని అన్నారు. కాంట్రాక్టర్ పనులు చేయలేక వెళ్లిపోయాడని, అయితే కొత్త కాంట్రాక్టర్ వచ్చే వరకు పనులు నిలిచిపోకుండా ఆర్‌అండ్‌బీ, ఐబీ శాఖల అధికారులు పనులను పూర్తి చేయాలని ఆదేశించారు. నిలిచిన పనులను తిరిగి ప్రారంభించేందుకు రెండు నెలల క్రితం స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి నేతృత్వంలో సమీక్షా సమావేశం నిర్వహించినట్లు గుర్తు చేశారు.

డిసెంబరు నెల వరకు పోతన స్మారక మందిరంతో పాటు పాలకుర్తి, వల్మిడి గ్రామాల్లో నిలిచిన పనులను సందర్శించి పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్‌అండ్‌బీ ఈఈ హుస్సేన్, ఐబీ ఈఈ ప్రవీణ్, ఏఈ సమంత్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ఆర్ఐ రాకేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు రాపాక సత్యనారాయణ, తీగారం మాజీ సర్పంచు పోగు శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

నేలకొరిగిన రైతు కూలీ నాయకుడు

ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మాచర్ల ఏసోబు మృతి
మావోయిస్టు కేంద్రకమిటీ సభ్యుడిగా తుదిశ్వాస
స్వస్థలం టేకులగూడెంలో విషాదఛాయలు



యేసోబు (ఫైల్)

కాజీపేట, సెప్టెంబరు 4: రైతుకూలీ నాయకుడు, రాడికల్ నేత, ప్రస్తుత మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యుడు మాచర్ల ఏసోబు (70) అలియాస్ జగన్ అలియాస్ రణదేవ్ దాదా మంగళవారం చత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ - దంతెవాడ జిల్లాల సరిహద్దులో భద్రతా దళాలు చేసిన ఎన్‌కౌంటర్‌లో కన్నుమూశారు. ఈయన మరణ వార్త తెలుసుకున్న గ్రామస్తులు.. ఏసోబు ఇంటికి వెళ్లి కన్నీరుమున్నీరయ్యారు. ఏసోబు కుమారుడు మాచర్ల మహేశ్ రోదనలు ఆపడం ఎవరి తరం కాలేదు. ఏసోబు కుమారుడు మహేశ్ ప్రత్యేక అంబులెన్స్‌లో ఏసోబు పార్థీవదేహాన్ని తీసుకురావడానికి బుధవారం మధ్యాహ్నం టేకులగూడెం నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లారు. గురువారం సాయంత్రం అతడి మృతదేహం స్వగ్రామం టేకులగూడెం రానుంది. అంత్యక్రియలు ఎప్పుడు జరుగాతాయనే విషయం స్పష్టంగా తెలియడం లేదు.

ఉద్యమ ప్రస్థానం

హనుమకొండ జిల్లా కాజీపేట మండలం టేకులగూడెం గ్రామానికి చెందిన ఏసోబుకు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై దొరలు, అగ్రవర్ణాలపై తిరుగుబాటే ఉద్యమం వైపు అడుగులు వేసేలా చేశాయి. 1980 సంవత్సరంలో రైతుకూలీ సంఘం కార్యకర్తగా తన ఉద్యమ ప్రస్థానాన్ని ప్రారంభించారు. అప్పటి పీపుల్స్‌వార్ అనుబంధ సంఘమైన రైతుకూలీ సంఘానికి 1990 నుంచి 199 సం వత్సరంలోనే జిల్లా అధ్యక్షుడిగా పని చేశారు. 1990 మే, 5, 6 తేదీలలో హనుమకొండ ప్రకాశ్‌రెడ్డి పేటలో రైతుకూలీ మహాసభలకు లక్షలాది జనాలను తరలించి పార్టీలో ప్రత్యేకస్థానాన్ని సంపాదించారు. ఐదో తరగతి వరకే చదివిన ఏసోబు.. 1993లో పూర్తిస్థాయి అజ్ఞాతంలోకి వెళ్లాడు. అన్నసాగర్ దళంలో కడారి రాములు దళంలో దళసభ్యుడుగా చేరారు. 1992లో ఏసోబు టేకులగూడెంకు వచ్చారని తెలుసుకున్న పోలీసులు.. గ్రామాన్ని చుట్టిముట్టినప్పుడు ప్రజల సహకారంతో చాకచక్యంగా తప్పించుకున్న సంఘటన రాష్ట్రంలో సంచలనం రేకెత్తించింది. నాటి నుంచి దంతెవాడ ఎన్‌కౌంటర్ వరకు ఎన్నో ఎన్‌కౌంటర్‌లలో పోలీసుల కల్లుకప్పి చాకచక్యంగా తప్పించుకున్నట్లు చెబుతారు. దంతెవాడలో ఆదివాసీలకు వ్యవసాయం చేయడం.. ఎగుమతి, దిగుమతి అనే అంశాలపై పాఠాలు చెప్పడంలో దిట్టగా చెబుతారు. మావోయిస్టు పార్టీలో అంచెలంచెలుగా ఎదిగి కేంద్రకమిటీ సభ్యుడిగా, మహారాష్ట్ర కార్యదర్శిగా కొనసాగుతున్నాడు. ఛత్తీస్‌గఢ్ దంతెవాడ బేస్ ఏరియా ఇన్‌చార్జిగా వ్యవహరించారు. ప్రస్తుతం మహారాష్ట్ర-ఛత్తీస్‌గఢ్ ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్నాడు. ఇలా మరణం వరకు ఉద్యమంలోనే కొనసాగాడు.

కుటుంబ నేపథ్యం

గట్టమ్మలమ్మ - చంద్రయ్యల దంపతులకు మొదటి సంతానం ఏసోబు. ఇతడికి అక్కలు విమల, శాంత, తమ్ముడు వెంకటేశ్, ఉన్నారు. ఏసోబు భార్య లక్ష్మి 2023 జనవరి 14న అనారోగ్యంతో ఇంట్లోనే మరణించింది. ఏసోబుకు ముగ్గురు కూతుళ్లు ఫాతిమా, పరిశుద్ధ, సంధ్య, కుమారుడు మహేశ్ ఉన్నారు. కుమారుడు ఎల్ఎల్‌బీ పూర్తి చేసి అడ్వకేట్‌గా ప్రాక్టీస్ చేస్తున్నాడు. కులాంతర వివాహం చేసుకున్న ఇతడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లక్ష్యంతో పనిచేశారు.. పట్టాలెక్కించారు


■ మూడు రోజులపాటు నిరంతరాయంగా రైల్వేట్రాక్ మరమ్మతు పనులు

■ 12 ఎక్స్‌కవేటర్లు, 11 టిప్పర్లు, 2 క్రేన్లు, వెయ్యిమంది సిబ్బంది

■ ఇంటికన్నె వద్ద పూర్తి.. పర్యవేక్షించిన రైల్వే జీఎం

■ మధ్యాహ్నం నుంచే పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ

■ రైల్వేశాఖకు రూ.కోట్లలో నష్టం



కేసముద్రం మండలం ఇంటికన్నె వద్ద రైల్వేట్రాక్ మరమ్మతులు పూర్తి చేసిన ప్రాంతంలో ట్రయల్ రన్‌లో వెళుతున్న ప్రయాణీకులు లేని సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్

వివరాలు 7వ పేజీలో..

ఈనెల 9 వరకు ఎన్పీడీసీఎల్‌లో సెలవులు రద్దు

హనుమకొండ, సెప్టెంబర్ 4: ఈనెల 9 వరకు భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణశాఖ సూచించిన నేపథ్యంలో అప్పటి వరకు ఎన్పీడీసీఎల్ పరిధిలో ఉద్యోగులకు సెలవులు రద్దు చేస్తున్నట్లు టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి వెల్లడించారు. అత్యవసరంగా కావాలనుకుంటే సీఈ (హెచ్ఆర్డీ అండ్ ట్రైనింగ్)కు సమాచారం ఇచ్చి అనుమతి పొందాలన్నారు. 16 సర్కిళ్ల ఎస్ఈలు అప్రమత్తంగా ఉంటూ ఎప్పటికప్పుడు విద్యుత్ సరఫరా పరిస్థితిని పరిశీలించాలన్నారు. 24 గంటలు పనిచేసేలా కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలన్నారు. తగినంత సామగ్రి, సిబ్బంది, కాంట్రాక్టర్లు సిద్ధంగా ఉండేటట్లు చూసుకోవాలన్నారు. ఎలాంటి అవసరం ఏర్పడినా కార్పొరేట్ కార్యాలయానికి సమాచారం ఇవ్వాలన్నారు.

కొలిపాక శ్రీనివాస్‌కు రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు



వడ్డెపల్లి, సెప్టెంబరు 4 : హనుమకొండ పింగిళి ప్రభుత్వ మహిళా డిగ్రీ అండ్ పీజీ కళాశాల (స్వయం ప్రతిపత్తి) చరిత్ర విభాగాధిపతి డాక్టర్ కొలిపాక శ్రీనివాస్‌కు రాష్ట్ర స్థాయి ఉత్తమ అధ్యాపక అవార్డు వచ్చినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లెఫ్టినెంట్ ఆచార్య బత్తిని చంద్రమౌళి గౌడ్ తెలిపారు. అధ్యాపకులందరూ డాక్టర్ శ్రీనివాస్‌ను ఆదర్శంగా తీసుకోవాలని పేర్కొన్నారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్, పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ జి.సుహాసిని, అకాడమిక్ కో ఆర్డినేటర్ డాక్టర్ ఎం. అరుణ, కంప్యూటర్ ఇన్‌చార్జి డాక్టర్ సురేష్‌బాబు తోపాటు అధ్యాపకులందరు డాక్టర్ శ్రీనివాస్‌ను అభినందించారు.

కమిషనరేట్‌లో ఐదుగురు ఎస్ఐల బదిలీ

వరంగల్ క్రైం, సెప్టెంబర్ 4: వరంగల్ కమిషనరేట్ పరిధిలో ఐదుగురు ఎస్ఐలను బదిలీ చేస్తూ బుధవారం కమిషనర్ అంబర్ కిషోర్ ఝా ఉత్తర్వులు జారీ చేశారు. జి.దివ్య మడికొండ నుంచి వంగరకు, జి.రాజేష్ రెడ్డి నర్సంపేట నుంచి చెన్నారావుపేటకు, జి.అరుణ్ చెన్నారావుపేట నుంచి నర్సంపేటకు, ఎం.డి.షసియోద్దిన్ సీసీఎస్ నుంచి హనుమకొండ ట్రాఫిక్‌కు, ఎం.డి.యాకుబ్ కమిషనరేట్ నుంచి సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

'ఉత్తముల ఎంపిక సవ్యంగా జరగలేదు'

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: హనుమకొండ జిల్లాలో ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపిక సవ్యంగా జరుగలేదని పలువురు ఉపాధ్యాయ సంఘ నేతలు ఆరోపణలు చేస్తున్నారు. ఎలాంటి ప్రామాణికత పాటించకుండా ఉత్తముల ఎంపికను జిల్లా విద్యాశాఖ నిర్వహించినట్లు టీయూటీఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షుడు నూతనకంటి బాబు ఒక ప్రకటనలో విమర్శించారు. ఇద్దరు ప్రభుత్వ ఉపాధ్యాయులను మాత్రమే ఉత్తములుగా ఎంపిక చేయడం పట్ల అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో అత్యధిక విద్యార్థులు ఉన్న పాఠశాలలు ప్రభుత్వ విభాగంలోనే ఉన్నాయని, అలాంటి పాఠశాలల్లో బోధిస్తున్న ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయుల్లో చోటు దక్కకపోవడంపై ఆయన నిరసన వ్యక్తం చేశారు. నిబద్ధతతో పనిచేస్తున్న వారిని ఎంపిక చేయకుండా అధికారులు వారికి తోచిన విధంగా ఎంపిక చేశారని ఆయన ఆరోపించారు. ప్రభుత్వ బడుల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సేవలు గుర్తించడంలో జిల్లా విద్యాశాఖ పూర్తిగా విఫలమయ్యిందని మరో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆకుతోట శ్రీనివాస్‌లు నిరసన వ్యక్తం చేశారు.

మత్స్య అభివృద్ధి బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలి

ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావుల జగదీశ్వర్ ప్రసాద్



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న డాక్టర్ రావుల జగదీశ్వర్‌ప్రసాద్

వడ్డెపల్లి, సెప్టెంబరు 4: తెలంగాణ ప్రాంతంలో ఆర్థికంగా వెనుకబడిన మత్స్యకారుల అభివృద్ధికి రూ.వెయ్యి కోట్లు నిధులు మంజూరి చేసి వారి ఆర్థికాభివృద్ధి కోసం మత్స్య అభివృద్ధి బోర్డును వెంటనే ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ రావుల జగదీశ్వర్ ప్రసాద్ ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముదిరాజ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు సరిపోయినన్ని నిధులు కేటాయించి అసంఘటితరంగంలో కార్మికులుగా ఉన్న వారికి గుర్తింపు కార్డులు జారీ చేయాలని సీఎం రేవంత్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ముదిరాజ్ కులస్తులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ నెల 8న ఉదయం 11 గంటలకు హనుమకొండ కేయూ - పెద్దమ్మగడ్డ రోడ్డులోని శారదా ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే ముదిరాజ్ మహాసభ రాష్ట్రస్థాయి సదస్సులో ముదిరాజ్‌లు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రావుల జగదీశ్వర్‌ప్రసాద్ కోరారు. ఈ సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ముదిరాజ్ మహాసభ హనుమకొండ, వరంగల్, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల అధ్యక్షులు డాక్టర్ మౌటం కుమారస్వామి, వన్నాల కృపాసాగర్, ఏర్ల వెంకన్న, ఆకుల సుభాష్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు బుల్లెట్ వెంకన్న, మహిళా నాయకురాలు లలిత, పిట్ట సురేష్ ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

జాబ్ మేళా వాయిదా

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: జిల్లా ఉపాధి కల్పనశాఖ ఆధ్వ ర్యంలో ఈనెల 6న నిర్వహించాల్సిన జాబ్‌మేళాను భారీ వర్షాల కారణంగా వాయిదా వేస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఉమారాణి బుధవా రం ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారో ప్రకటన జారీ చేస్తామని ఆమె తెలిపారు.

వరంగల్ మార్కెట్ ధరలు

పంట	క్వింటా గరిష్ట	క్వింటా కనిష్ట
మక్కలు (బిల్టీరకం)	2902	2700
పల్లికాయ (సూక)	5300	5100
పల్లికాయ (పచ్చిది)	4500	3400
పెసళ్లు	6712	4552
పత్తి	7610	5000
పసుపు (కాడి)	--	--
పసుపు (గోల)	--	--
తేజ మిర్చి	12000	8000
తేజ ఏసీ	17500	14000
వండర్‌హాట్ ఏసీ	14500	13000
యూఎస్341 ఏసీ	14500	11000
తాలు మిర్చి	6000	3000

- వరంగల్ వ్యవసాయం

పట్టభద్రులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు

పట్టభద్రులకు ఆర్‌బీఐ క్విజ్ పోటీలు
ఆన్‌లైన్ ద్వారానే నమోదు
ఇద్దరు విద్యార్థులతో ఒక టీమ్
4 స్థాయిల్లో బహుమతుల ప్రదానం

వరంగల్ చౌరస్తా, సెప్టెంబరు 4: భారతీయ రిజర్వు బ్యాంకు ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తిచేసుకున్న నేపథ్యంలో పట్టభద్రులైన విద్యార్థులకు మేథాశక్తి పెంపొందించే విధంగా క్విజ్ పోటీలను నిర్వహించడానికి ఏర్పాట్లు చేసింది. జాతీయ స్థాయిలో సాగే ఈ క్విజ్ పోటీలు రాష్ట్ర స్థాయి నుంచి దేశ స్థాయి వరకు జరుగనున్నాయి. మూడు దశల్లో జరిగే ఈ పోటీల్లో మూడు దశల్లో ఉత్తీర్ణులైన వారికి బహుమతుల ప్రదానం ఉంటుందని ఆర్‌బీఐ సూచించింది.

ఆన్‌లైన్ ద్వారా నమోదు

ఆర్‌బీఐ ఏర్పాటు చేసిన క్విజ్ పోటీల్లో పాల్గొనడానికి ఇద్దరు విద్యార్థులతో కూడిన ఒక టీంగా వెబ్‌సైట్ నందు పేరు నమోదు చేసుకోవాలి. ఈ రిజిస్ట్రేషన్ ఈనెల 17న రాత్రి 9 గంటల లోపు నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్ పరీక్ష

ఆర్‌బీఐ క్విజ్ పోటీల్లో వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈనెల 19, 20, 21 తేదీల్లో ఆన్‌లైన్ పరీక్ష ఉంటుంది. ఈ మూడు రోజుల్లో ఏదైనా ఒక రోజు పరీక్షలో పాల్గొనాలి.

వివిధ దశలు

ఆన్‌లైన్ పరీక్షలో పాల్గొనే విద్యార్థులు పాస్ అయిన వారికి రాష్ట్ర స్థాయిలో మరో పరీక్ష ఉంటుంది. రాష్ట్ర స్థాయిలో పాస్ అయిన వారికి జోనల్ (ఐదు రాష్ట్రాలు) కలిపి ఒక పరీక్ష ఉంటుంది. ఇందులో పాస్ అయిన వారికి జాతీయ స్థాయిలో పరీక్ష ఉంటుంది.

ఈ విద్యార్హతలు ఉండాలి

ఈ క్విజ్‌లో పాల్గొనే విద్యార్థులు డిగ్రీ, ఇంజనీరింగ్, మెడిసిన్, ఫార్మసీ, పీహెచ్‌డీ చదువుతున్న విద్యార్థులై ఉండాలి. 25 సంవత్సరాల లోపు వారు మాత్రమే అర్హులు.

బహుమతుల వివరాలు

ఆన్‌లైన్‌లో నమోదై పరీక్ష రాసి రాష్ట్ర స్థాయిలో పాస్ అయిన వారికి ప్రథమ బహుమతిగా రూ.2లక్షలు, ద్వితీయ బహుమతి రూ.1 లక్షా 50వేలు, తృతీయ బహుమతి రూ.లక్ష .

జోనల్ స్థాయిలో పరీక్ష రాసిన వారికి పాస్ అయిన వారికి ప్రథమ బహుమతి రూ.5లక్షలు, ద్వితీయ బహుమతి రూ.4లక్షలు, తృతీయ బహుమతి రూ.3లక్షలు.

జాతీయ స్థాయిలో..

జాతీయ స్థాయిలో పరీక్ష రాసి పాస్ అయిన వారికి ప్రథమ బహుమతి రూ.10లక్షలు, ద్వితీయ బహుమతి రూ.8లక్షలు, తృతీయ బహుమతి రూ.6లక్షలు నగదు బహుమతిగా ఇవ్వబడును.

ప్రత్యేక పోర్టల్

ఆర్‌బీఐ 90 క్విజ్ సంబంధించిన వివరాలన్నీ ప్రతీ రోజు ఆర్‌బీఐ పోర్టల్‌లో తెలియజేయడం జరుగుతుంది. క్విజ్‌లో పాల్గొనే విద్యార్థులు ఈ పోర్టల్‌ను ప్రతీ రోజు చూడవచ్చు.

క్విజ్‌లో పాల్గొనండి..

రాజు, జిల్లా లీడ్‌బ్యాంకు మేనేజర్

భారతీయ రిజర్వు బ్యాంకు ఏర్పాటై 90 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా దేశ వ్యాప్తంగా ఆర్‌బీఐ క్విజ్ పోటీలు నిర్వహిస్తున్నది.. ఇందులో వరంగల్ జిల్లాలోని పట్టభద్రులైన విద్యార్థులు ఆన్‌లైన్ ద్వారా పేరు నమోదు చేసుకొని క్విజ్ పోటీల్లో పాల్గొనాలని కోరారు.

పంతం పట్టి.. పతకం కొట్టింది..

- పారాలింపిక్స్‌లో కాంస్యం సాధించిన 'పరుగుల సివంగి' దీప్తి
- పేద కుటుంబంలో పుట్టినా మొక్కవోని ఆత్మవిశ్వాసం ఆమె సొంతం
- రాష్ట్రంలో ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్

పర్వతగిరి, సెప్టెంబరు 4: పంతం పట్టి పతకాన్ని సాధించింది. ఇతరుల లాగా ఆలోచించలేకపోయినా మొక్కవోని ఆత్మవిశ్వాసంతో తన లక్ష్యాన్ని చేరుకుంది. బరిలోకి దిగిన ప్రతీ పోటీలోనూ పతకమే లక్ష్యంగా దూసుకెళ్లింది. ప్రపంచ అత్యున్నత పోటీలైన పారాలింపిక్స్‌లో కూడా ఏ మాత్రం తడబడకుండా లక్ష్యం దిశగా దూసుకెళ్లి కాంస్య పతకాన్ని అందుకుంది. కాంస్య తన స్వగ్రామమైన వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలోని కల్లెడను వార్తల్లో నిలిచేలా చేసింది. రాష్ట్రంలోనే ఈ ఘనత సాధించిన తొలి అథ్లెట్‌గా రికార్డుల్లో నిలిచింది.

పేద కుటుంబంలో జన్మించినా..

మండలంలోని కల్లెడ గ్రామానికి చెందిన జీవంజి ధనలక్ష్మి-యాదగిరి దంపతుల ప్రథమ పుత్రిక దీప్తి. గ్రామంలోని ఆర్డీఎఫ్ పాఠశాలలో విద్యాభ్యాసం చేస్తూ నాలుగో తరగతి నుంచే రన్నింగ్‌పై మక్కువ పెంచుకుంది. ఇంటి నుంచి పాఠశాలకు, పాఠశాల నుంచి ఇంటికి నడవడం కన్నా పరుగెత్తుతూనే వెళ్లేదని స్థానికులు చెబుతున్నారు. ఆమెలోని ప్రతిభను గుర్తించిన ఆర్డీఎఫ్ ఫౌండర్ మెంబర్ ఎర్రబెల్లి రామ్మోహన్‌రావు క్రీడల వైపు మళ్లించారు. ఉదయం, సాయంత్రం వేళల్లో కోచ్ ద్వారా ప్రత్యేక తర్ఫీదునిస్తూ ప్రోత్సహించారు. అథ్లెటిక్స్‌లో జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో 2016లో పాఠశాల స్థాయిలోనే 'సాయ్'లో శిక్షణకు ఎంపికైంది. శిక్షణ తీసుకుంటూ అక్కడే విద్యాభ్యాసం కొనసాగిస్తోంది.


పారాలింపిక్స్‌లో పతకంతో జివంజి దీప్తి

అవమానాలు ఎదురైనా..

ఇతర అమ్మాయిల మాదిరిగా కాకుండా కొంత భిన్నంగా ఉండడంతో పలువురు హేళన చేసేవారు. అబ్బాయిల లక్షణాలే అధికంగా ఉన్నాయని సూటిపోటి మాటలతో వేధించేవారు. వాటిని పట్టించుకోకుండా పాల్గొన్న ప్రతీ పోటీలోనూ పతకమే తన లక్ష్యంగా ముందుకు సాగింది. విమర్శలన్నింటికీ నోటితో గాకుండా పరుగుతోనే సమాధానం చెప్పింది. కూతురును జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి పంపించడానికి గాను కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రులు తమకున్న ఎకరం పొలాన్ని సైతం అమ్మేశారు. రెక్కాడితే గానీ డొక్కాడని కుటుంబంలో పుట్టిన దీప్తి తల్లిదండ్రుల నమ్మకాన్ని నిలబెట్టింది.

బరిలోకి దిగితే పతకమే..!

చిరుత వేగంతో దూసుకెళ్లే దీప్తి బరిలోకి దిగితే ఖచ్చితంగా పతకం వచ్చి తీరాల్సిందే. పోటీలో నిలిచిన ఇతర క్రీడాకారులను వెనక్కి నెట్టి మరీ పరుగు పందెంలో ముందుకు దూసుకెళ్తుంది. ఆమెలోని వేగాన్ని గుర్తించిన 'సాయ్' అకాడమీ కోచ్ నాగపురి రమేష్ ప్రత్యేకంగా తీర్చిదిద్దుతున్నారు. ఒకవైపు చదువు కొనసాగిస్తూనే పరుగుపై దృష్టి సారించింది. మెరుగులు దిద్దితే పల్లెల్లోనూ ఆణిముత్యాలు తయారవుతారనడానికి దీప్తి విజయాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.



ప్రధాని, సీఎం అభినందనలు


ప్రధాని ట్వీట్


సీఎం ట్వీట్

పారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించిన జీవంజి దీప్తికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, వరంగల్ జిల్లాకు చెందిన మంత్రి కొండా సురేఖ, పర్వతగిరి మండలానికి చెందిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు తదితరులు దీప్తికి ట్విటర్ (ఎక్స్)లో అభినందనలు తెలిపారు. విశ్వవేదికపై మువ్వన్నెల జెండాను రెపరెపలాడించిన దీప్తి ప్రస్థానం స్ఫూర్తిదాయకమని, భవిష్యత్తులో మరిన్ని పతకాలను సాధించాలని ఈ సందర్భంగా వారు ఆకాంక్షించారు.

జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో సత్తా

- 2016లో 'సాయ్' అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నప్పటి నుంచి దీప్తి పలు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరుస్తూ పతకాలు సాధిస్తోంది.
- 2016లో కరీంనగర్‌లో జరిగిన జూనియర్ సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో పాల్గొని గోల్డ్‌మెడల్ సాధించింది. తమిళనాడులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో 5వ స్థానం, 200 మీటర్లలో 6వ స్థానం సాధించింది.
- 2017లో కేరళలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్. గుంటూరులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్లు, 400 మీటర్లలో గోల్డ్‌మెడల్.
- 2018లో రాంచీలో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్.
- 2019లో ఛత్తీస్‌గడ్‌లో జరిగిన యూత్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్‌మెడల్. మహారాష్ట్రలో జరిగిన ఖేలో ఇండియా నేషనల్ చాంపియన్‌షిప్‌లో 100, 200 మీటర్లలో సిల్వర్ మెడల్. కర్ణాటకలోని ఉడిపిలో జరిగిన సౌత్ జోన్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లు, 200 మీటర్లలో గోల్డ్ మెడల్ సాధించడమే గాకుండా 100 మీటర్లలో న్యూ మీట్ రికార్డును సృష్టించింది. గుంటూరులో జరిగిన జూనియర్ నేషనల్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో గోల్డ్ మెడల్, 200 మీటర్లలో సిల్వర్ మెడల్. పంజాబ్‌లో జరిగిన నేషనల్ స్కూల్ గేమ్స్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 100 మీటర్లలో గోల్డ్ మెడల్, 200 మీటర్లలో సిల్వర్ మెడల్.
- అంతర్జాతీయ స్థాయిలో హాంగ్‌కాంగ్‌లో జరిగిన ఏషియన్ యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో 200 మీటర్లలో కాంస్య పతకం, మిడ్లే రిలేలో రజత పతకం సాధించింది. మొరాకోలో జరిగిన పారా ఏషియా పోటీల్లో 400 మీటర్ల విభాగంలో, జపాన్‌లో జరిగిన నేషనల్ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో గోల్డ్‌మెడల్ సాధించి పారాలింపిక్స్‌లో అర్హత సాధించింది.
- ప్రస్తుతం పారాలింపిక్స్‌లో కాంస్య పతకంతో మెరిసింది.


కోచ్ నాగపురితో దీప్తి

నా కల సాకారమైంది..

నాగపురి రమేష్, సాయ్ అకాడమీ కోచ్

ప్రతీ కోచ్‌కు తన శిష్యులు ప్రపంచంలోనే అత్యున్నతమైన ఒలింపిక్స్‌లో పతకం సాధించాలని కల ఉంటుంది. ఆ కల నాకు దీప్తి ద్వారా సాకారమైంది. నాకే పతకం వచ్చినంత సంతోషంగా ఉంది. ఇటీవల జరిగిన ఒలింపిక్స్‌లో తెలుగు రాష్ట్రాల నుంచి ఒక్క పతకం కూడా లేకపోవడం కొంత ఆవేదన మిగిల్చింది. దాన్ని భర్తీ చేస్తూ దీప్తి పారాలింపిక్స్‌లో కాంస్య పతకాన్ని కొల్లగొట్టింది. నార్మల్‌గా ఉన్న వ్యక్తులకు శిక్షణనివ్వడం ఎవరికైనా సాధ్యమే కానీ, దీప్తి లాంటి అథ్లెట్‌కు శిక్షణనివ్వడం అనేది సవాళ్లతో కూడుకున్న పని. ఎనిమిదేళ్ల కఠోరసాధనతో ఇది సాధ్యమైంది.

మాజీ మంత్రి ఎర్రబెల్లి అభినందనలు

రాంనగర్: ఒలంపిక్ అథ్లెట్‌లో కాంస్య పతకం సాధించిన దీప్తి జీవాంజికి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అభినందనలు తెలిపారు. పతకం సాధించిన సందర్భాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జీవాంజి తల్లిదండ్రులకు బుధవారం ఫోన్ చేసి అభినందించారు. పారిస్ ఒలంపిక్ అథ్లెట్‌లో దీప్తి జీవాంజి కాంస్య పతకం సాధించడం యావత్ దేశానికి, తెలంగాణకు, ఉమ్మడి వరంగల్ జిల్లాకు గర్వకారణమని ఈ సందర్భంగా దయాకర్‌రావు కొనియాడారు.

దీప్తి సాధించిన పతకాలతో తల్లిదండ్రులు


అదృష్టంగా భావిస్తున్నాం..

జీవంజి ధనలక్ష్మి, యాదగిరి (దీప్తి తల్లిదండ్రులు)

అవలక్షణాలతో పుట్టిన పిల్లలను తల్లిదండ్రులు దురదృష్టంగా భావిస్తుంటారు. కానీ, దీప్తి మాకు జన్మించడం మా అదృష్టంగా భావిస్తున్నాం. పరుగు పందెంలో పాల్గొనడానికి గాను మా సర్వస్వం ధారపోశాం. మా నమ్మకాన్ని నిలబెట్టింది.

లక్ష్యంతో పనిచేశారు.. పట్టాలెక్కించారు..

యుద్ధ ప్రాతిపదికన 3 రోజులపాటు రైల్వేట్రాక్ మరమ్మతు పనులు

మధ్యాహ్నం నుంచే పాక్షికంగా రైళ్ల పునరుద్ధరణ

కేసముద్రం, సెప్టెంబరు 4 : భారీ వర్షం సృష్టించిన బీభత్సంతో సికింద్రాబాద్-విజయవాడ సెక్షన్‌లోని మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఇంటికన్నె, తాళ్లపూసలపల్లి వద్ద రైల్వేట్రాక్ ధ్వంసమైంది. దీంతో మూడు రోజులుగా రైళ్లరాకపోకలను పూర్తిగా నిలిపేశారు. ఈ విధ్వంసంతో పాటు రైళ్ల నిలిపివేతతో రైల్వేశాఖకు రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. అయితే రైల్వే యంత్రాంగం ట్రాక్ మరమ్మతు పనులను త్వరితగతిన పూర్తిచేసి.. రైళ్లను పునరుద్ధరించేందుకు ఓ లక్ష్యంతో పనిచేసింది. విజయవంతంగా మరమ్మతులు పూర్తి చేసి రైళ్లను పట్టాలెక్కించారు. కేసముద్రం - ఇంటికన్నె మధ్య 418 కిలోమీటరు వద్ద 40 మీటర్ల పొడవున రైల్వే ట్రాక్ ధ్వంసమైన ప్రాంతంలో మరమ్మతు పనులు తుదిదశకు చేరాయి. ఇదే మండలం తాళ్లపూసపల్లి- మహబూ బాబాద్ మధ్యన 432, 434 కిలోమీటరు వద్ద వరద తాకిడికి దెబ్బతిన్న సుమారు 30 మీటర్ల రైల్వే ట్రాక్‌ను మంగళవారం సాయంత్రమే మరమ్మతులు పూర్తి చేసిన విషయం తెలిసిందే. ఇంటికన్నె-కేసముద్రం మధ్యన కూడా మరమ్మతులు పూర్తి కావడంతో బుధవారం మధ్యాహ్నం నుంచే రైళ్ల రాకపోకలను పాక్షికంగా పునరుద్ధరించారు.


ఇంటికన్నె వద్ద పునరుద్ధరణ చేసిన రైల్వే అప్‌లైను ట్రాక్


ఇంటికన్నె వద్ద ఈనెల 1న ట్రాక్ కొట్టుకుపోగా వేలాడుతున్న పట్టాలు (ఫైల్)

మూడు రోజులుగా పనులు..

కేసముద్రం-ఇంటికన్నె రైల్వేస్టేషన్ల మధ్య 418 కిలోమీటరు రాయి వద్ద సుమారు 40 మీటర్ల ట్రాక్, తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య 432,434 కిలోమీటరు వద్ద సుమారు 30 మీటర్ల రైల్వేట్రాక్ వరద నీటికి కొట్టుకు పోయిన విషయాన్ని అక్కడే కాపలా ఉన్న ట్రాక్‌మెన్‌లు రైల్వే అధికారులకు సమాచారం అందించారు. దీంతో కేసముద్రం రైల్వేస్టేషన్‌లో బెంగళూరు-దానాపూర్ సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్ అప్‌అండ్‌డౌన్ వైపులా వెళ్లే రైళ్లు, మహబూబాబాద్‌లో సింహపురి ఎక్స్‌ప్రెస్‌లు నిలిచిపోయాయి. తాళ్లపూసపల్లి-మహబూబాబాద్ మధ్య ధ్వంసమైన ట్రాక్‌ను మంగళవారం సాయంత్రం వరకు పునరుద్ధరించి సిద్ధం చేశారు. ఇక ఇంటికన్నె వద్ద రైల్వేట్రాక్ బాగా ధ్వంసం కావడం, వరద ప్రవాహం ఉండడంతో మరమ్మతులకు భారీ యంత్రాంగం కృషి చేయాల్సివచ్చింది. ఆదివారం సాయంత్రం నుంచి రేయింబవళ్లు 12 ఎక్స్‌కవేటర్ యంత్రాలు, 11 టిప్పర్లు, 2 క్రేన్లు, ఒక రోడ్డు రోలర్‌తోపాటు 600 మంది కార్మికులు, ఇంజనీరింగ్, ఓహెచ్‌ఈ (ఓవర్‌హెడ్ ఎక్విప్‌మెంట్), ఎస్‌అండ్‌టీ (సిగ్నల్ అండ్ టెలికాం) సిబ్బంది, ఉన్నతాధికారులు వెయ్యి మందికిపైగా నిర్విరామంగా పనిచేశారు. సిబ్బందికి భోజనం, నీళ్ల అక్క డికే తీసుకువచ్చి అందించారు. మరమ్మతులు జరుగుతున్న ప్రాంతం అంతా ఒకపెద్ద క్వారీ పరిశ్రమలాగా కనిపించింది. నిరంతరం శ్రమించి ఎట్టకేలకు బుధవారం ఉదయం 10 గంటలకు అప్‌లైను ట్రాక్‌ను సిద్ధం చేశారు.

వేగంగా పునరుద్ధరణ పట్ల హర్షాతిరేకాలు..

ట్రాక్ పూర్తిగా వరద తాకిడికి కొట్టుకుపోయి రైలుపట్టాలు వేలాడుతున్న స్థితి నుంచి మూడురోజుల్లోనే పునరుద్ధరణ చేయడంపట్ల ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ట్రాక్ మీదుగా తొలుత ఒక గూడ్స్‌రైలును ఆ తర్వాత కేసముద్రం రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు లేకుండా మూడు రోజులుగా నిలిచి ఉన్న బెంగళూరు-దానాపూర్ సంఘమిత్ర ఎక్స్‌ప్రెస్‌ను ట్రయల్‌రన్‌లో భాగంగా పంపించారు. మధ్యాహ్నం 2 గంటలకు గుంటూరు నుంచి సికింద్రాబాద్ వెళ్లే గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను పంపించారు. అందుబాటులోకి వచ్చిన అప్‌లైనుపై గోల్కొండ, నాగర్‌సోల్ ఎక్స్‌ప్రెస్‌లు, డౌన్‌వైపు హౌరా, గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌లను కాషన్ ఆర్డర్‌తో నెమ్మదిగా నడిపించారు. రాత్రి వరకు డౌన్‌లైనును సిద్ధం చేసి గురువారం నుంచి అన్ని రైళ్ల రాకపోకలను పునరుద్ధరించే అవకాశమున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. మూడు రోజులుగా యుద్ధప్రాతిదికన చేపట్టిన ఈ మరమ్మతు పనులను దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ అజయ్‌కుమార్ జైన్ ప్రత్యేక రైలులో పలుమార్లు ఇంటికన్నెకు వచ్చి సమీక్షించారు. ఇక దక్షిణమధ్య రైల్వే డీఆర్‌ఎం భరతేష్ కుమార్ జైన్ మూడురోజుల పాటు అక్కడే ఉండి పనులను పూర్తిగా పర్యవేక్షించారు. ఈ మరమ్మతులకు రూ.6కోట్లకుపైగా ఖర్చయినట్లు అంచనా వేస్తున్నారు. మూడు రోజులపాటు రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంవల్ల రైల్వేశాఖకు కోట్లలో నష్టం వాటిల్లినట్లు తెలుస్తోంది. మూడు రోజుల క్రితం జరిగిన ట్రాక్ ధ్వంసమైన పరిస్థితి ప్రస్తుత మరమ్మతుల దృశ్యాలను పోల్చుతూ 'హాట్సాఫ్ రైల్వే' అంటూ ప్రజలు అభినందనలు తెలుపుతున్నారు.

రాయనపాడు వద్ద వరదతో ఇబ్బందులు..

గిర్మాజీపేట, సెప్టెంబరు 4: భారీ వర్షాలు, వరదలతో సికింద్రాబాద్ - విజయవాడ మార్గంలోని తాళ్లపూసలపల్లి, ఇంటికన్నె మధ్య ట్రాక్ దెబ్బతినడంతో రైళ్ల రాకపోకలు నిలిచిపోగా.. బుధవారం నాటికి మరమ్మతులు పూర్తవడంతో రైళ్లను పాక్షికంగా పునరుద్ధరించారు. అయితే విజయవాడ సమీపంలోని రాయనపాడు రైల్వేస్టేషన్ ఇంకా వరద ముంపులోనే ఉండటంతో పలు రైళ్లను వరంగల్ వైపు రాకుండా దారి మళ్లించారు. హైదరాబాద్-శాలిమార్ ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.20గంటలకు వరంగల్‌కు చేరుకుని.. సుమారు 40 నిమిషాల తర్వాత విజయవాడ వైపు బయలుదేరింది. రాత్రి 7.30 గంటల వరకు కొండపల్లిలోనే నిలిచిపోయింది. వరంగల్ నుంచి పలువురు ప్రయాణికులు ఈ రైలులో విజయవాడ, విశాఖపట్టణం వెళ్లారు. ఆ రైలు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఉండటంతో అక్కడి నుంచి దారి మళ్లిస్తున్నట్లు సమాచారం. అలాగే సికింద్రాబాద్ నుంచి గుంటూరుకు బయలుదేరిన గోల్కొండ ఎక్స్‌ప్రెస్‌ను వరంగల్ రాకుండా నడికూడ మీదుగా గుంటూరుకు దారి మళ్లించారు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరాల్సిన గోదావరి, వందేభారత్ తదితర పలు రైళ్లను ఆలస్యంగా నడికూడ మీదుగా దారి మళ్లిస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం గోల్కొండ, ఈస్ట్‌కోస్ట్ రైళ్లు వచ్చినపుడు వరంగల్ రైల్వేస్టేషన్‌లో కొద్దిసేపు ప్రయాణికుల సందడి కనిపించింది. అయితే రైళ్ల రద్దు, దారి మళ్లింపు సమాచారంతో ప్రయాణికుల సందడి తగ్గింది. రైల్వేస్టేషన్‌లోని హెల్ప్‌లైన్ సిబ్బంది ప్రయాణికులకు ఎప్పటికప్పుడు సమాచారం ఇస్తున్నారు.

చదువుల దివిటీ.. గురువు..

● నేడు ఉపాధ్యాయ దినోత్సవం ● పాఠశాలలు, కళాశాలల్లో గురుపూజోత్సవం ● సన్మాన కార్యక్రమాలకు ఘనంగా ఏర్పాట్లు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: అజ్ఞానమనే చీకటిలో ఉన్నవారికి, విజ్ఞానమనే దారిని చూపి వారి జీవితాల్లో వెలుగులు నింపే దివిటీలు ఉపాధ్యాయులు. అలా అందరి జీవితాల్లో వెలుగులు నింపే టీచర్ల సేవలను గుర్తు చేసుకుంటూ ఏటా సెప్టెంబరు 5న దివంగత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ప్రపంచ వ్యాప్తంగా అక్టోబరు 5న టీచర్స్‌డేను జరుపుకుంటుండగా, మన దేశంలో మాత్రం సర్వేపల్లి రాధాకృష్ణన్ పుట్టిన రోజున నిర్వహించుకోవడం జరుగుతోంది. భారతరత్న సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశ తొలి ఉపరాష్ట్రపతిగా, రెండో రాష్ట్రపతిగా పనిచేశారు. 1988లో తిరుత్తణిలో ఆయన జన్మించిన ఆయన యూనివర్సిటీ ఆఫ్ మద్రాస్ నుంచి ఫిలాసఫీలో మాస్టర్ డిగ్రీ పూర్తి చేశారు. కోల్‌కతా, మైసూర్ యూనివర్సిటీలో ఆయన అధ్యాపకుడిగా పని చేశారు. చాలా మంది విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దారు. ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగిన సర్వేపల్లి రాధాకృష్ణన్ ఏ రోజు తన పుట్టిన రోజును జరుపుకోవాలని కోరుకోలేదట. విద్యార్థులు ఎవరైనా పుట్టిన రోజు వేడుకలు నిర్వహిస్తామని ఆయన్ను అడిగితే వద్దని వారించే వారట. విద్యార్థులు అంటే అమితమైన ఇష్టాన్ని ప్రదర్శించే ఆయన, విద్యార్థులు గురువుల పట్ల ప్రేమాభిమానాలు కలిగి ఉండాలని చెప్పేవారట. అందుకే 1962వ సంవత్సరం నుంచి ఆయన పుట్టిన రోజున అందరూ ఉపాధ్యాయులను గౌరవిస్తూ టీచర్స్ డే వేడుకలను జరుపుతున్నారు. నాడు మత ఆధ్యాత్మిక పునరుద్ధరణ వాదాన్ని అకడమిక్ తాత్వికస్థాయికి తీసుకువెళ్లిన గొప్ప పండితుడు సర్వేపల్లి రాధా కృష్ణన్. ఆయన 15 సార్లు నోబెల్ సాహిత్య బహుమతికి, 11 సార్లు నోబెల్ శాంతి బహుమతికి నామినేట్ అయ్యారు. ఈ క్రమంలోనే సర్వేపల్లి తనకు కృష్ణుడితో సమానమని జాతిపిత మహాత్మాగాంధీ కీర్తించారు. యుగపురుషుల గురించి ఉపన్యాసం ఇవ్వండి అని పిలిస్తే యుగపురుషుడే వచ్చారు అని సర్వేపల్లి రాధాకృష్ణన్‌ను ఉద్దేశించి కీర్తించారట హోవెల్ అనే మహనీయుడు. అంతేకాదు తనలోని మామూలు మనిషిని దర్శించిన మహర్షి అంటూ సోవియట్ అధినేత స్టాలిన్ కూడా రాధాకృష్ణన్ గొప్పతనాన్ని చాటారు. అయితే గాంధీజీ మాటలను బట్టి ఆయన ఒక గీతాచార్యుడిగా, గొప్ప గురువుగా కీర్తించబడ్డారు. ఈనేపథ్యంలోనే భవిష్యత్ తరాలు ఆయన మార్గంలో పయనించాలని దిశానిర్దేశం చేస్తూ ఆయన పుట్టిన రోజును టీచర్స్ డే గా జరపాలని నాటి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నిర్ణయం తీసుకున్నారు.

కాగా, ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా విద్యార్థులు తమకు చదువుచెప్పే గురువులను ఘనంగా సత్కరించుకునేందుకు సిద్ధమవయ్యారు.

వరంగల్, హనుమకొండ జిల్లాల్లో 'ఉత్తములు' వీరే..

వరంగల్ ఎడ్యుకేషన్, సెప్టెంబరు 4: వరంగల్, హనుమకొండ జిల్లాల నుంచి పాఠశాల, ఇంటర్మీడియేట్ విద్యాశాఖల నుంచి మొత్తం ఐదుగురిని రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది.

కొంక అనురాధ




వరంగల్ జిల్లాలోని రాయపర్తి మండలంలోని కొత్తూరు జడ్పీహెచ్ఎస్‌లో తెలుగు స్కూల్ అసిస్టెంట్ ఉపాధ్యాయురాలుగా పనిచేస్తోంది. 2009లో స్కూల్ అసిస్టెంట్ తెలుగు ఉపాధ్యాయురాలుగా ప్రస్తుత సిద్ధిపేట జిల్లాలోని వేచరేణి జడ్పీహెచ్ఎస్‌లో ఉద్యోగం పొందారు. అక్కడ 3 ఏళ్లు పనిచేసిన అనంతరం ప్రస్తుత జనగామ జిల్లాలోని కామారెడ్డిగూడెం జడ్పీహెచ్ఎస్‌లో 2013 నుంచి 2015 వరకు, 2017 నుంచి 2022 వరకు చిట్యాల, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పనిచేశారు. జీవో నెం.317లో రాయపర్తి మండలంలోని కొత్తూరు జడ్పీహెచ్ఎస్‌కు వచ్చి ఇక్కడే పనిచేస్తున్నారు. స్కూల్లో కిచెన్ గార్డెన్, ఫ్లవర్ గార్డెన్, బొటానికల్ గార్డెన్‌ను ఏర్పాటు చేయడంలో కృషి చేయడంతో పాటు విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేస్తోంది.

కె.ఇందుమతి



కె.ఇందుమతి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 1996లో నిర్వహించిన కాలేజ్ సర్వీస్ కమిషన్ పరీక్ష ద్వారా జువాలజీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికయ్యారు. ఆంధ్రప్రదేశ్‌లోని విజయనగరం జిల్లాలోని తాటిపూడి రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలో చేరారు. అనంతరం 2001లో హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండలంలోని తెలంగాణ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలకు బదిలీపై వచ్చి ఇక్కడే ప్రస్తుతం ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

పి.సంపత్‌కుమార్



2004లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించిన కాలేజ్ సర్వీస్ కమిషన్ పరీక్షలో కెమిస్ట్రీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై ప్రస్తుత సిద్ధిపేట జూనియర్ కళాశాలలో ఉద్యోగంలో చేరారు. అక్కడ నుంచి 2011లో వరంగల్ జిల్లాలోని రంగశాయిపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విధులు నిర్వర్తించారు. అనంతరం 2018 నుంచి 2021 వరకు వర్ధన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేశారు. ఇక్కడి నుంచి ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది ప్రస్తుతం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాలోని వాంకిడి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్‌గా పనిచేశారు. 2024లో బదిలీపై వరంగల్ జిల్లా నర్సంపేటలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ప్రస్తుతం పనిచేస్తున్నారు.

జి.వెంకటయ్య



1983లో ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా ప్రస్తుతం సిరిసిల్ల జిల్లా జిల్లెల్ల జడ్పీహెచ్ఎస్‌లో ఉద్యోగంలో చేరారు. సిద్ధిపేట జిల్లాలోని శనిగరం జడ్పీహెచ్ఎస్, కరీంనగర్‌లోని గొడిశాల జడ్పీహెచ్ఎస్‌లో 1996 వరకు ఎస్జీటీగా పనిచేశారు. అక్కడి నుంచి స్కూల్ అసిస్టెంట్‌గా పదోన్నతి పొంది కరీంనగర్‌లోని సిర్సపల్లి యూపీఎస్‌లో పనిచేశారు. 2001లో జువాలజీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా పదోన్నతి పొంది వరంగల్ జిల్లాలోని ఫోర్ట్ వరంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేరారు. 2017లో ప్రిన్సిపాల్‌గా పదోన్నతి పొంది ప్రస్తుత ములుగు జిల్లాలోని మంగపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లారు. ప్రస్తుతం 2024 నుంచి వర్ధన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పనిచేస్తున్నారు.

డాక్టర్ ఎల్.కొమురారెడ్డి



డాక్టర్ ఎల్.కొమురారెడ్డి 2002లో హనుమకొండ జిల్లా చిన్నకోడెపాక జడ్పీహెచ్ఎస్‌లో హిందీ లాంగ్వేజ్ పండిట్‌గా ఉద్యోగంలో చేరారు. అక్కడ నుంచి 2011 బదిలీపై మనుగొండ యూపీఎస్‌లో పనిచేశారు. 2012లో కాలేజ్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన జూనియర్ లెక్చరర్ల పరీక్షలో ఉత్తీర్ణులై వరంగల్ జిల్లాలోని నెక్కొండ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ సబ్జెక్టులో జూనియర్ లెక్చరర్‌గా చేరారు. 2018లో బదిలీపై హసన్‌పర్తిలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వెళ్లారు. అక్కడి నుంచి సాధారణ బదిలీల్లో 2024లో ప్రస్తుతం నర్సంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్)లో విధులు నిర్వర్తిస్తున్నారు.

భూపాలపల్లి జిల్లాలో..

అమరేందర్‌రెడ్డి, రాజయ్య




భూపాలపల్లిటౌన్, సెప్టెంబరు 4: భూపాలపల్లి జిల్లాకు చెందిన ఇద్దరు ఉపాధ్యాయులు రాష్ట్రస్థాయి ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. భూపాలపల్లి మండలంలోని కొంపల్లి జడ్పీహెచ్ఎస్‌లో ఇంగ్లిష్ బోధిస్తున్న స్కూల్ అసిస్టెంట్ అమరేందర్‌రెడ్డి, మొగుళ్లపల్లి మండలం మొట్లపల్లికి చెందిన వ్యాయామ ఉపాధ్యాయుడు గూడెల్లి రాజయ్య అవార్డు అందుకోనున్నారు.

రజనీకాంత్



కాటారం: గిరిజన గురుకులాల రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఆడెపు రజనీకాంత్ ఎంపికయ్యారు. భూపాలపల్లి జిల్లా కాటారం గిరిజన సంక్షేమ బాలుర గురుకులంలో ఆర్ట్‌అండ్ క్రాఫ్ట్ టీచర్‌గా ఆయన విధులు నిర్వర్తిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన గురుకులాల్లో ఉత్తమ ఉపాధ్యాయులను ఎంపిక చేయగా అందులో రజనీకాంత్ ఒకరు.

సుధాకర్‌రెడ్డి



జఫర్‌గడ్, సెప్టెంబరు 4 : జనగామ జిల్లా జఫర్‌గడ్ మండలం తిడుగు ప్రాథమిక పాఠశాలకు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు కుందూరు సుధాకర్‌రెడ్డి రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపికయ్యారు. హసన్‌పర్తి మండలం భైరాన్‌పల్లికి చెందిన సుధాకర్‌రెడ్డి.. 2002లో ములుగు వెంకటాపూర్ మండలం బాపూసింగ్ పాఠశాలలో ఉపాధ్యాయుడిగా నియామకమయ్యారు. 2013లో జఫర్‌గడ్ మండలం కూనూరు ప్రాథమిక పాఠశాలలో పదేళ్ల పాటు ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తించి.. ఇటీవల జులై నెలలో ఇదే మండలం తిడుగు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు బదిలీపై వచ్చారు.

అధ్యాపకుల విభాగంలో..



కేడీసీ కెమిస్ట్రీ అధ్యాపకుడు శ్రీనివాస్

కేయూ క్యాంపస్: హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కెమిస్ట్రీ సీనియర్ అధ్యాపకుడు డాక్టర్ వాసం శ్రీనివాస్ రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. 22 ఏళ్ల బోధనానుభవం కలిగిన డాక్టర్ వాసం శ్రీనివాస్ విద్యారంగంలో అందించిన విశిష్ట సేవలకు అవార్డుకు ఎంపికయ్యారు. వరంగల్ జిల్లా సంగెం మండలకేంద్రానికి చెందిన శ్రీనివాస్.. 2002లో జూనియర్ లెక్చరర్‌గా ఎంపికై 2010లో పదోన్నతి ద్వారా డిగ్రీ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా విధుల్లో నిర్వహిస్తున్నారు. గతంలో ములుగు, సిద్ధిపేట ప్రభుత్వకళాశాలల్లో పనిచేశారు. అంతర్జాతీయ, జాతీయ సదస్సుల్లో సుమారు 31 పరిశోధన పత్రాలను ప్రచురించారు. తెలుగు అకాడమీ, అంబేద్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం వర్సిటీల కెమిస్ట్రీ 11 పాఠ్యపుస్తకాలను ప్రచురించారు.

ఫిజిక్స్ ప్రొఫెసర్ వెంకట్రామిరెడ్డి



కేయూ క్యాంపస్: కేయూ ఫిజిక్స్ సీనియర్ ప్రొఫెసర్ భైరు వెంకట్రామిరెడ్డి ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డుకు ఎంపికయ్యారు. 35 ఏళ్ల సుదీర్ఘ బోధన, పరిశోధన అనుభవం కలిగిన భైరు వెంకట్రామిరెడ్డి ఫిజిక్స్ విభాగంలో విభాగాధిపతిగా, బోర్డు ఆఫ్ స్టడీస్ చైర్మన్‌గా, వర్సిటీ రిజిస్ట్రార్‌గా, పరీక్షల నియంత్రణాధికారిగా, అదనపు పరీక్షల నియంత్రణాధికారిగా, డీన్ అకడమిక్‌గా, వర్సిటీ హాస్టల్స్ డైరెక్టర్‌గానూ విశిష్ట సేవలందించారు. వరంగల్ జిల్లా పెద్దకోడెపాక గ్రామానికి చెందిన భైరు వెంకట్రామిరెడ్డి 1992లో కేయూ నుంచి ఫిజిక్స్ విభాగంలో పీహెచ్‌డీ డిగ్రీ పొందారు. 2003లో యూనివర్సిటీ పీజీ కళాశాల గోదావరిఖనిలో ఫిజిక్స్ అధ్యాపకులు ఉద్యోగ ప్రస్థానాన్ని మొదలుపెట్టారు. 2018లో ప్రొఫెసర్‌గా పదోన్నతి పొందారు.



తానేదార్‌పల్లిలో ఆర్థిక సాయం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య

కూలిన ఇళ్లను పరిశీలించిన రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు4: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మండలంలోని తానేదార్‌పల్లిలో కూలిపోయిన ఇళ్లను బుధవారం మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్‌ఘన్‌పూర్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా బాధితులు గాదె బుచ్చయ్య, బస్కుల నర్సయ్య కుటుంబాలను సందర్శించి వారికి మనోస్థైర్యం కల్పించారు. ఈ సందర్భంగా స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో వెంకన్నతో పాటుగా ఇతర అధికారులతో మాట్లాడి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. తనవంతుగా బాధితులకు తాత్కాలిక అవసరాల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో నాయకులు మాజీ సర్పంచ్ తాటికొండ సురేష్, బీఆర్ఎస్ మండల అధ్యక్షులు మాచర్ల గణేశ్, మార్కెట్ మాజీ వైస్‌చైర్మన్ చందర్‌రెడ్డి, రాజిరెడ్డి, గాదె పురుషోత్తం, ధర్మారెడ్డి, రఘురాములు, బస్కుల జైహింద్, రంజిత్, జనార్ధన్‌రెడ్డి, పద్మారెడ్డి, శ్రీను పాల్గొన్నారు.

ఏబీవీపీ నాయకులపై కేసు కొట్టివేత

జనగామ కల్చరల్, సెప్టెంబరు 4: మెడికల్ కళాశాల సాధన కోసం చేపట్టిన ఉద్యమంలో భాగంగా ఏబీవీపీ నాయకులపై పెట్టిన కేసు ను బుధవారం కొట్టివేశారు. జనగామ జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో గతంలో శాంతియుతంగా ఉద్యమాలు నిర్వహించారు. రెండు సంవత్సరాల క్రితం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ జనగామకు వచ్చిన సందర్భంగా మెడికల్ కళాశాల కావాలనే ఆకాంక్షను బలంగా వినిపించడంతో ఏబీవీపీకి చెందిన 9 మంది విద్యార్థులపై పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా న్యాయవాది సాదం సంపత్ ప్రత్యేక చొరవతో వాదోపవాదాల తర్వాత బుధవారం న్యాయస్థానం తుది తీర్పును ప్రకటిస్తూ ఎలాంటి సాక్ష్యాధారాలు లేని కారణంగా కేసును కొట్టివేస్తున్నట్లు ప్రకటించింది. ఈ సందర్భంగా ఏబీవీపీ జిల్లా కన్వీనర్ తోట హృతిక్ సాయి మాట్లాడుతూ తమపై అక్రమంగా పెట్టిన కేసు కొట్టివేసినందుకు హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజులలో విద్యారంగ సమస్యలపై శాంతియుతంగా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి చింతకింది సంతోష్, ఉల్లెంగుల రాజు, తాండ్ర అభినయ్, పగిడిపల్లి కార్తీక్, గుంటుపల్లి కార్తీక్, పాల్వాయి కార్తీక్, కపిల ఆదిత్య, పాల్గొన్నారు.

గురువులకు అపూర్వ సత్కారం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ఖిలావరంగల్, సెప్టెంబరు 4: నాలుగు దశాబ్దాల క్రితం విద్యాబోధన చేసి తమ ఉన్నతికి కారకులైన ఇరువురు గురువులను అపూర్వంగా సత్కరించారు. నగరంలోని ఖమ్మంరోడ్‌లో గల ఏకశిల కమ్యూనిటీ హాల్‌లో బుధవారం ఈ వేడుక జరిగింది. జనగామ జిల్లా జఫర్‌గఢ్ మండలం కూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1982-83 విద్యా సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న సుమారు 40 మంది పూర్వ విద్యార్థులు సంఘటితమై ఈ వేడుకలు నిర్వహించుకున్నారు. గతంలో తమకు ఆంగ్ల బోధన చేసిన ప్రధానోపాధ్యాయుడు తిరునగరి నర్సింహస్వామి, తెలుగును బోధించిన పొడిశెట్టి శ్రీనివాస్‌చార్యులను వారు శాలువా, జ్ఞాపికలతో ఘనంగా సత్కరించారు. ఆనాటి తీపి గుర్తులను మననం చేసుకున్నారు. కార్యక్రమంలో పరమేశ్వర్, వేణుగోపాల్, జ్యోతి, శంకర్, మధు తదితరులు పాల్గొన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఒక రోజు ముందే ఈ వేడుకలు నిర్వహించుకోవడం విశేషం.

ఆస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు చేయూత

బచ్చన్నపేట, సెప్టెంబరు 4: బచ్చన్నపేట ప్రభుత్వాస్పత్రిలో మౌలిక వసతుల కల్పనకు హైదరాబాద్‌కు చెందిన సర్వప్రేమ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు చేయూతనందించారు. ఆపరేషన్ థియేటర్‌లో రూ. 61,500 విలువ చేసే ఏసీతో పాటు రూ. 45 వేల ఆటోక్లేవ్ యంత్రాన్ని, రూ. 11 వేల నీటిశుద్ధి యంత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సంస్థ సీఈవో సరిత మాట్లాడుతూ ఆస్పత్రిలో పలు వసతులు అవసరమని గుర్తించి అందజేసినట్టు తెలిపారు. తమ సంస్థ ఆధ్వర్యంలో పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో మేనేర్ విజయ్, కోఆర్డినేటర్లు కస్పారెడ్డి, లూయిస్‌రెడ్డి, సోషల్ వర్కర్ సురేష్‌లు పాల్గొన్నారు. సేవలకు ఉపయోగించే వస్తువులతో పాటు, వాటర్ ఫిల్టర్‌ను అందించిన సొసైటీకి ఆస్పత్రి సూపరెండెంట్ శ్రీనివాస్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు అరుణకుమారి, సృజన, మానస, ప్రసన్నకృష్ణ పాల్గొన్నారు.

రైతు సంక్షేమానికి కడియం పెద్దపీట

చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు

పల్లగుట్టలో ఎమ్మెల్యే కడియం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం



కార్యక్రమంలో మాట్లాడుతున్న పొట్లపల్లి శ్రీధర్‌రావు

చిలుపూర్, సెప్టెంబరు 4: రైతు సంక్షేమానికి స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి పెద్దపీట వేస్తున్నారని చిలుపూర్ గుట్ట దేవస్థానం మాజీ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు పొట్లపల్లి శ్రీధర్‌రావు అన్నారు. బుధవారం మండలంలోని పల్లగుట్ట ఊర చెరువు వద్ద స్థానిక రైతులతో కలిసి కడియం ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు పూర్తవుతున్నా, సకాలంలో వర్షాలు రాకపోవడంతో సాగునీటి కోసం ఇబ్బందులు పడ్డామన్నారు. సమస్యను ఎమ్మెల్యే కడియం దృష్టికి తీసుకెళ్లడంతో మల్లన్నగండి ఎడమకాలువ, దేవాదుల గేట్‌వాల్వ్‌ల ద్వారా చెరువులను నింపేందుకు అధికారులను ఆదేశించారని ఈ సందర్భంగా గుర్తు చేశారు. గోదావరి జలాలతో పాటు, ప్రస్తుతం కురుస్తున్న వర్షాలు తోడయ్యాయని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు గడ్డమీది సురేశ్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ చిర్ర నాగరాజు, తౌటి సునిల్, దార రాజు, ఎమ్డీ రఫీ, రత్నాకర్‌రెడ్డి, జీడి ఆనందం, ఇసురం రాజు, ఏసు, మనోజ్, దార భరత్, తరున్, అశోక్‌పాల్ తదితరులు పాల్గొన్నారు.

పోషకాహారం తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా సంక్షేమాధికా జయంతి

దేవరుప్పుల, సెప్టెంబరు 4: కిషోర బాలిక నుండే అన్ని పోషకాలు ఉన్న ఆహారం తీసుకోవాలని జిల్లా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమాధికారి చిట్టి జయంతి అన్నారు. బుధవారం మండలంలోని సింరాజుపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రంలో పోషణమాసం సందర్భంగా జరిగిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గర్భిణులు ప్రతీ రోజు 4పూటలు ఆహారం తీసుకోవాలన్నారు. బిడ్డ పుట్టగానే బాలింత గంటలోపు ఆ బిడ్డకు ముర్రుపాలు పట్టాలన్నారు. 6నెలల వరకు బిడ్డకు తల్లిపాలు పట్టాలని, 7వ నెల నుంచి అతనపు ఆహారం ఇవ్వాలన్నారు. అదే విధంగా దేవరుప్పులలో జరిగిన కార్యక్రమానికి ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సావిత్రి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో సూపర్‌వైజర్ శ్రీదేవి, మహిళా సాధికారిక జండర్ స్పెషలిస్ట్ పవిత్ర, కార్యదర్శి మధుకర్, ఏఎన్ఎంలు దేవేంద్ర, సుజాన, అంగన్‌వాడీ టీచర్లు రేణుక, శ్రీలత, మంగమ్మ, భాగ్యమ్మ సులోచన శోభ, ఆర్‌బీఎస్‌కె డాక్టర్ రజనీ కాంత్, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

● జఫర్‌గడ్ : మండలంలోని పలు గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసోత్సవాలు కొనసాగాయి. బుధవారం మండలంలోని కూనూరు, జఫర్‌గడ్, హిమ్మత్‌నగర్, తదితర అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసోత్సవాల సందర్భంగా పిల్లల బరువును తూకం వేయడం, పోషకాహారంపై అవగాహన, గర్భిణుల్లో రక్తహీనత నివారణ, పరీక్షలు వంటి అంశాలపై వివరించారు. ఈనెల 1 నుంచి 30 వరకు అంగన్‌వాడీ కేంద్రాల్లో పోషణమాసం పేరుతో కార్యక్రమాల నిర్వహణకు శ్రీకారం చుటారు. కార్యక్రమాల్లో ఏఎన్ఎంల శ్రీలత, అంగన్‌వాడీ టీచర్లు ఇ.సుందరి, సిహెచ్.సంధ్యారాణి, బి.రజిత, ఆశ వర్కర్లు ఎస్.సునిత, బి.స్వరూప, డి.శోభ, కె.స్వరూప, తల్లులు, పిల్లలు పాల్గొన్నారు.

యువత ఓటింగ్‌లో భాగస్వామ్యం కావాలి

జఫర్‌గడ్, సెప్టెంబరు 4 : యువజన కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి ప్రతినిధుల ఎన్నికల ఓటింగ్ ప్రక్రియలో యువత భాగస్వామ్యం కావాలని ఎంపీటీసీల ఫోరం జిల్లా మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి కోరారు. యూత్ కాంగ్రెస్ ప్రతినిధుల ఎన్నిక నేపథ్యంలో ఆన్‌లైన్ ఓటింగ్ ప్రక్రియ జిల్లాలో కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో జఫర్‌గడ్ మండలం కూనూరు, రఘునాథ్‌పల్లి, పీఎస్ పరిధిలోని వెంకటాపూర్, తదితర గ్రామాల్లో సభ్యత్వ నమోదు, ఆన్‌లైన్ ఓటింగ్ విధానాన్ని కాంగ్రెస్ నాయకులు పరిశీలించారు.

ఈ సందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ 18 నుంచి 35 ఏళ్ల వయసు గల యువతీ యువకులు యూత్ కాంగ్రెస్‌లో చేరాలని కోరారు. పార్టీని గ్రామ స్థాయి నుంచి మరింత పటిష్టవంతం చేసేలా యువజన కాంగ్రెస్ శ్రేణులు అంకితభావంతో పని చేయాలన్నారు. కాగా, ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఆదేశాల మేరకు యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, మండల అధ్యక్షుడిగా మండలం నుంచి పోటీ చేస్తున్న మొగిలిపాక ఉదయ్‌కిరణ్, టి.రాజెందర్‌లకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. ప్రతినిధుల ఎన్నిక కోసం తొలిసారిగా ఆన్‌లైన్ ద్వారా నిర్వహిస్తున్న ఈ ఓటింగ్ ప్రక్రియ ఈనెల 14 వరకు కొనసాగుతుందన్నారు. సమావేశంలో అభ్యర్థులు ఉదయ్‌కిరణ్, రాజెందర్, ఎన్ఎస్‌యుఐ మండల అధ్యక్షుడు ఎడ్ల సందీప్, నాయకులు మర్రి సుధీర్, దాట్ల అశోక్, లెంకల రాజు, మేటి చిరంజీవి, ఎడ్ల అనిల్, ఎడ్ల శేఖర్, ప్రశాంత్, మొగిలి పాల్గొన్నారు.

రేపు సదరం క్యాంపు స్లాట్ బుకింగ్

జనగామ రూరల్, సెప్టెంబర్ 4: దివ్యాంగులు సదరం క్యాంపులో పాల్గొనేందుకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలని డీఆర్‌డీవో వసంత బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. రెన్యూవల్ చేసుకునే వికలాంగులకు ఈనెల 6న మధ్యాహ్నం 12 గంటల నుంచి మీసేవలో సదురం స్లాట్ బుకింగ్ అందుబాటులో ఉంటుందన్నారు. కొత్త వారికి మీసేవలో స్లాట్ బుకింగ్ నిరంతరం అందుబాటులో ఉంటుందని తెలిపారు. రెన్యూవల్ వారికి ఈనెల 17, 19, 24, 26 తేదీలలో ఆర్థోపెడిక్, 20న దృష్టిలోపం, 27న వినికిడి లోపంతో ఉన్నవారికి క్యాంపు ఉంటుందని తెలిపారు. కొత్తవారికి 10, 12, 17, 19, 24, 26 తేదీలలో ఆర్థోపెడిక్, 20న దృష్టిలోపం, 27న వినికిడి లోపం ఉన్నవారికి క్యాంపు ఉంటుందన్నారు. స్లాట్ బుకింగ్ చేసుకున్న వారు జనగామ ప్రభుత్వాసుపత్రికి మీసేవ రశీదుతో పాటు ఆధార్ కార్డు, ఫోటో, వైద్యుల రిపోర్టు, వెంట తెచ్చుకోవాలన్నారు.

10న రాష్ట్ర స్థాయి డాక్ అదాలత్

జనగామ రూరల్, సెప్టెంబర్ 4: సెప్టెంబర్ 10న రాష్ట్ర స్థాయి డాక్ అదాలత్ నిర్వహిస్తున్నందున పోస్టల్ శాఖ ద్వారా ఫిర్యాదులను ఈనెల 31 వరకు దరఖాస్తులను అందించాలని చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ ఎం.లక్ష్మి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. ఫిర్యాదులను ఒక పోస్టల్ కవర్లో ఎం లక్ష్మి మాధవి అసిస్టెంట్ డైరక్టర్ ఆఫ్ పోస్టల్ సర్వీసెస్ ఛీఫ్ పోస్టుమాస్టర్ జనరల్ కార్యాలయం హైదరాబాద్‌కు పంపించాలన్నారు. కవర్‌పై డాక్ అదాలత్ అని రాసి, మొబైల్ నెంబర్, ఈమెయిల్ ఐడీ, చిరునామా తెలియజేయలని కోరారు. సెప్టెంబర్ 10న నిర్వహించే డాక్ అదాలత్ గూగుల్ మీట్ లింకును మొబైల్ నెంబర్, ఇమెయిల్ ఐడీ ద్వారా తెలియజేయడం జరుగుతుందన్నారు.

జనగామలో షార్ట్‌ఫిలిం చిత్రీకరణ

జనగామ రూరల్, సెప్టెంబర్ 4: ముదురు మొగుడు ముద్దుల పెళ్ళాం షార్ట్‌ఫిలిం పార్ట్-3 ని జనగామలో చిత్రీకరణ చేశారు. ఓ మధ్య తరగతి కుటుంబంలో అమ్మాయి వివాహం కోసం తల్లిదండ్రులు పడే ఆరాటం ఈ షాట్ ఫిలింలో చిత్రీకరణ చేశారు. కార్యక్రమంలో డైరెక్టర్ విలేజి శ్రీను, డీవోపి, ఎడిటర్ శ్రీకాంత్ నాయక్, నిర్మాత జీ.కృష్ణ, నటినటులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి..?

రఘునాథపల్లి, సెప్టెంబరు 4: పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించిన సంఘటన మండల కేంద్రంలో బుధవారం రాత్రి చోటుచేసుకున్నట్లు తెలిసింది. మండలంలో కొందరు వ్యక్తులు వ్యక్తులుపేకాట ఆడుతుండగా టాస్క్‌ఫోర్సు పోలీసులకు సమాచారం అందగా వారు దాడి చేసి 12 మందిని అదుపులోకి తీసుకుని పంచనామా నిర్వహించి పోలీస్ స్టేషన్‌లో అప్పగించినట్లు సమాచారం.

వినియోగదారుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలి

పాలకుర్తి, సెప్టెంబరు 4 :మండల కేంద్రంలోని ఏడీఈ కార్యాలయం ఆవరనలో (నేడు) 5న నిర్వహించే విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారుల ఫిర్యాదు పరిష్కార వేదిక చైర్‌పర్సన్ ఎన్.వీ. వేణుగోపాలాచారి తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ పాలకుర్తి, కొడకండ్ల మండలాల విద్యుత్ వినియోగదారులు ఈ పరిష్కార వేదికలో పాల్గొని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. కాలిపోయిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లతో పాటు లోవోల్టేజీ సమస్యను పరిష్కరిస్తామన్నారు. డిస్ట్రిబ్యూషన్ సిస్టం పెంపుదలతో పాటు మీటర్లలో లోపాలుంటే వాటిని సవరించడమే కాకుండా వాటిని మార్చి కొత్త మీటరు ఇస్తామని పేర్కొన్నారు. కేటగిరి మార్పు, సర్వీస్ రద్దు వంటి సమస్యల పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమానికి వినియోగదారులు హాజరై వినియోగించుకోవాలని తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనులు చేపట్టాలి

రఘునాథపల్లి, సెప్టెంబరు 4: మండల కేంద్రంలో అంగడి నిర్వహించే రోడ్డుపై వర్షపు నీరు నిలువకుండా ఉండేందుకు మరమ్మతు పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తు సీపీఎం నాయకులు బుధవారం రోడ్డుపై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు మాట్లాడుతూ రోడ్లపై వర్షపు నీరు నిలువకుండా చూడాలని, దోమలతో విష జ్వరాల భారిన పడకుండా ప్రజలను కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కుమ్మరికుంట్ల దాసు, పొదల నాగరాజు, గంగాపురం మహేందర్, కడారి ఐలయ్య, అంజనేయులు, సాంబరాజు, బిక్షపతి, యాదగిరి, వెంకన్న పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

జనగామ రూరల్, సెప్టెంబర్ 4: రక్తదానం ప్రాణదానంతో సమానమని, అత్యవసర పరిస్థితిల్లో దాతలు ఇచ్చే రక్తం ప్రాణాలను నిలబెడుతుందని వాసవీ క్లబ్ జోన్ చైర్మన్ వెంకటేశ్వర్లు అన్నారు. వాసవీ క్లబ్ వ్యవస్థాపకుడు కేసి గుప్త జయంతి వారోత్సవాల్లో భాగంగా వాసవీ క్లబ్ ఆఫ్ లింగాల ఘనపురం ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కేంద్రంలోని ఏకశిలా డిగ్రీ కళాశాల్లో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం ఉమెన్స్ ఎంపవర్మెంట్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రక్తదానం చేయడంతో ఒకరి జీవితాన్ని కాపాడిన వారు అవుతామన్నారు. కార్యక్రమంలో దారం అశోక్, మెతు కు అనంతరాములు, బెల్లిదే శ్రీధర్, గోడిశాల రామకృష్ణ, రమణ, బెల్లిదే శ్రీను పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపిక రద్దు

జనగామ రూరల్, సెప్టెంబర్ 2: భారీ వర్షాల కారణంగా దివ్యాంగుల సహాయ ఉపకారణలకు లబ్ధిదారుల ఎంపికను రద్దు చేస్తునట్లు మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిణి జయంతి బుధవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. వర్షాలు తగ్గుముఖం పట్టిన తరువాత మళ్లీ ఎంపిక తేదీలను ప్రకటిస్తామన్నారు.



కూలిన ఇంటిని చూపుతున్న బాధితులు

వర్షాలకు కూలిన పూరిల్లు

జఫర్‌గడ్, సెప్టెంబరు 4 : వర్షాలకు మండలంలోని ముగ్దుంతండాలో భూక్య బాలు అనే ఓ గిరిజనుడి పూరిల్లు కూలిపోయింది. గత మూడు రోజుల పాటు మండలంలో వర్షాలు కురిశాయి. దీంతో మండలంలోని పలు గ్రామాల్లో లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. మండలంలోని ముగ్దుంతండాలో బాలు పూరి గుడిసెలోకి సైతం నీరు రావడంతో గోడలు తడిసి మంగళవారం రాత్రి కూలిపోయింది. దీంతో బాధిత పేద గిరిజన కుటుంబీకులు నిరాశ్రయులయ్యారు. ఇంట్లోని వంట సరుకులు, బియ్యం, బట్టలు తడిసి పోయాయని, దీంతో రూ.50 వేల వరకు ఆర్థిక నష్టం జరిగిందని స్థానికులు తెలిపారు. బాధిత నిరుపేద గిరిజన కుటుంబాన్ని ఆర్థికంగా చేయూతనందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని, అధికారులను గిరిజన సంఘం నేతలు, గిరిజనులు కోరుతున్నారు.

నర్మెట్టలో..

నర్మెట : గత ఆరు రోజులుగా కురుస్తున్న వర్షాలకు నర్మెట మండలంలోని మచ్చుపహడ్ గ్రామానికి చెందిన కొంపెల్లి రేణుకకు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. కూలిన ప్రదేశంలో ఎవరూ లేకపోవడంతో పెద్ద ప్రమాదం తప్పింది. ఇల్లు కూలిపోవడంతో తమ కుటుంబానికి గూడు లేకుండా పోయిందని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. గత ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తే కట్టుకుందామని చూసినప్పటికీ ఇల్లు రాలేదని తెలిపింది. దీంతో అదే పెంకుటిల్లులో ఉంటున్నామని తెలిపింది. బాధితురాలికి నష్టపరిహారం అందించి ఇల్లు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు.

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్లకు 9 వరకు గడువు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 4: మండలం లోని పెంబర్తిలో గల మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల (స్టేషన్‌ఘన్‌పూర్)లో అడ్మిషన్లకు ఈ నెల 9 లోగా దరఖాస్తు చేసుకోవాలని స్పెషల్ అధికారి ఎన్.వీ.ఎస్.చారి కోరారు. ఈ నెల 4 నుంచి 9 వరకు దోస్త్ ప్రక్రియ ద్వారా అడ్మిషన్లు పొందాలన్నారు. వివరాలకు 98666 10429 నంబరులో సంప్రదించాలన్నారు.

గురుకులంలో మిగిలిన సీట్ల భర్తీ

స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్, సెప్టెంబరు 4: డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్ బైపీసీ ప్రథమలో మిగిలిన సీట్ల భర్తీకి దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ తెలిపారు. 10వ తరగతి పాసైన జనగామ, యాదాద్రి, భువనగిరి, నల్గొండ జిల్లాలకు చెందిన అర్హులైన విద్యార్థులు ఈనెల 6 లోగా ఒరిజినల్ సర్టిఫికేట్లతో కళాశాలలో సంప్రదించాలని కోరారు. మిగిలిన ఖాళీల్లో బైపీసీ ప్రథమలో ఎస్సీ 1, బీసీ 4, ఓసీ 1, ఎస్సీ సీ 1 ఉన్నాయన్నారు.

స్టేషన్‌ఘన్‌పూర్ ఎంపీడీవోగా విజయశ్రీ

స్టేషన్‌ఘన్‌పూర్, సెప్టెంబరు4: స్టేషన్‌ఘన్‌పూర్ నూతన ఎంపీడీవోగా అనుముల విజయశ్రీ బుధవారం బాధ్యతలను స్వీకరించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఇక్కడి పనిచేసిన ఉమాదేవి నల్లగొండ జిల్లాకు బదిలీ కాగా ఆమె స్థానంలో సూర్యాపేట జిల్లా కోదాడ నుంచి విజయశ్రీ ఇక్కడికి వచ్చారు. నూతనంగా వచ్చిన ఎంపీడీవోను మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఈవోలు తిరునగరి శ్రీకాంత్, ఏదునూరి సత్యనారాయణ, చెన్నమల్ల రమేశ్, చుక్కలింగయ్య, సంతోష్, వెంకటరమణ, ప్రేమయ్య తదితరులు పాల్గొన్నారు.

గిరిజన పాఠశాలలో మెడికల్ క్యాంపు

జనగామ కల్చరల్, సెప్టెంబరు 4: ఉచిత మెడికల్ క్యాంపుకు 250 మంది హాజరైనట్లు ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జె.లచ్చిరాం తెలిపారు. బుధవారం జనగామ మండలం చంపక్‌హిల్స్ లోని ఆశ్రమ పాఠశాలలో ఓబుల్‌కేశవాపురం పీహెచ్‌సీ వైద్య బృందం మెడికల్ క్యాంపు నిర్వహించారు. విద్యార్థులకు పరీక్షలు జరిపి మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యార్థులకు ఆరోగ్య సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.వాసు, హరిచంద్, రతన్‌సింగ్, సరోజన స్వాతి, స్వరూప, రాములు, వీరన్న, సారయ్య, శత్రు, పరమేశ్వర్ పాల్గొన్నారు.

ముమ్మరంగా బీజేపీ సభ్యత్వ నమోదు

బచ్చన్నపేట, సెప్టెంబరు 4: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ముమ్మరంగా కొనసాగుతుందని ఆపార్టీ జిల్లా అధికార ప్రతినిధి సద్ది సోమిరెడ్డి అన్నారు. గ్రామాల్లో సభ్యత్వం నమోదు కోసం టీంలుగా ఏర్పడి నమోదు చేయించటం జరుగుతుందని పోచన్నపేటలో జరిగిన కార్యక్రమంలో ఆయన తెలిపారు. బీజేపీలో సభ్యులుగా చేరేందుకు యువత ఉత్సాహం చూపుతున్నారని అన్నారు. ఆన్‌లైన్ ద్వారా నమోదు ప్రక్రియ ఉంటుందన్నారు. బచ్చన్నపేటలో జిల్లా ప్రధాన కార్యదర్శి దుబ్బ రాజశేఖర్ పాల్గొన్నారు. కార్యక్రమాల్లో దొంతుల చంద్రమౌళి, పెండెం నగేష్, సురేశ్, కేశయ్య, కనకయ్య, మీనయ్య, రాజు, జూకంటి గణేశ్, గద్ద రాజు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

రఘునాథపల్లి, సెప్టెంబరు 4: ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు హస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పొదల లవకుమార్, బాలికల కన్వీనర్ దాసగాని సుమ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని ప్రభుత్వ పాఠశాలలతో పాటు ఖిలాషాపూర్ కేజీబీవీ, ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలను ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం సందర్శించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంపై జిల్లా అధికారులు దృష్టి సారించాలన్నారు. క్రీడా ప్రాంగణాలలో గడ్డి మందు పిచికారి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు వంశీతేజ, ఆర్య తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో పల్లె దవాఖాన

నూతన భవనం నిర్మించాలని గ్రామస్థుల విజ్ఞప్తి

పాలకుర్తి, సెప్టెంబరు 4 : మండలంలోని ఈరవెన్ను గ్రామంలోని పల్లె దావాఖాన శిథిలావస్థలకు చేరింది. ఈ భవనం ఎప్పుడు కూలుతుందోనని ఆరోగ్యశాఖ సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. గత నాలుగు రోజులుగా వర్షాలు కురుస్తుండడంతో ఆ భవనంలో విధులు నిర్వహించడానికి జంకుతున్న పరిస్థితి ఉండడంతో అంజనేయస్వామి ఆలయం ఆవరనలో ఆరోగ్యశాఖ సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. గ్రామస్థులు అప్పటి పాలకులకు పలుమార్లు నూతన భవనం నిధులు మంజూరు చేసి నిర్మించాలని కోరారు. 30 ఏళ్ల క్రితం నిర్మించిన ఆరోగ్య ఉప కేంద్రంలో ప్రభత్వం గత రెండేళ్ల క్రితం పల్లె దావాఖానను అదే ఉప కేంద్రంలో నిర్వహిస్తుంది. విధులు నిర్వహిస్తున్న ఆరోగ్య సిబ్బంది శిథిలవస్థలో భవనంలో ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని విధులు నిర్వహించాల్సి వస్తుందని ఆరోగ్య సిబ్బంది చెబుతున్నారు. ఇప్పటికైన జిల్లా కలెక్టర్ స్పందించి నూతన భవనం కోసం నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు కోరారు.



శిథిలావస్థకు చేరిన ఆరోగ్య ఉప కేంద్రం

ఉత్తమ ఉపాధ్యాయులు

గురుపూజోత్సవం సందర్భంగా నేడు అవార్డుల అందజేత

జనగామ కల్చరల్, సెప్టెంబరు 4: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లాలో 75 మంది ఉత్తమ ఉపాధ్యాయులను జిల్లా అధికారులు ఎంపిక చేశారు. బుధవారం విడుదల చేసిన ఉత్తమ ఉపాధ్యాయ జాబితాలో ఎంపికైన వారు నేడు (ఈనెల 5న) గురుపూజోత్సవాన్ని పురస్కరించుకొని ఉత్తమ అవార్డులు అందజేయనున్నారు. జాబితాలో ఉన్న వారి వివరాలు ఇలా ...

మండలాల వారీగా ...

బచ్చన్నపేట మండలంలో వి.రాజేందర్‌రెడ్డి, కె.మల్లారెడ్డి, జి.నర్సింహస్వామి, ఎస్.అమృత, పి.నర్సమ్మ, సీహెచ్.శేఖరయ్య, పి.యాదగిరి, చిలుపూరు మండలంలో ఆర్.సరోజన, వి.ప్రకాష్, కె.కల్యాణి, వి.వాణిశ్రీ, ఎ.రాచవేణుగోపాల్‌రెడ్డి, కె.అరుణ, దేవరుప్పుల మండలంలో బి.రవికాంత్, వై.బాలనర్సయ్య, బి.ఉమారాణి, జి.నిరంజని, జి.తిరుపతిరెడ్డి, డి.భీమా, స్టేషన్‌ఘన్‌పూర్ మండలంలో సీహెచ్.రవీందర్, బి.సంధ్యారాణి, వి.లింగమూర్తి, పి.లలితకుమారి, టి.మానస, జె.లచ్చిరాం, జనగామ మండలంలో చల్లా అరుణ, ఎల్.ఉమాదేవి, చాంద్‌బీబీ, ఎ.కిషన్, కె.ఎల్.మర్రెడ్డి, ఆర్.రాధిక, డి.గోపాలకృష్ణ, కొడకండ్ల మండలంలో రజియాబేగం, బి.మేనక, సీహెచ్.రమానాథ్, బి.శ్రీనివాస్‌చారి, జి.వేణు, ఈ.స్వప్న, లింగాలఘణపురం మండలంలో కోటయ్య, వై.వెంకటేశ్వర్‌రెడ్డి, సీహెచ్.సమ్మక్క, వై.శ్రీనివాస్, మారేపల్లి అలెగ్జాండర్, కె.క్రిష్ణవేణి, కె.జ్యోతి, టి.లక్ష్మణ్ గౌడ్, నర్మెట మండలంలో పి.దామోదర్, ఎస్.కమల, కె.అంజనేయచారి, సఫావత్ నాగమణి, వి.సదానందం, కె.మధుసూదన్, పాలకుర్తి మండలంలో సీహెచ్.అశోక్‌కుమార్, ఎం.రాంమోహన్‌రావు, టి.హేమలత, ఎన్.శ్రీనివాస్, ఎ.సరిత, ఎన్.అరుణకుమారి, బి.నర్సింహస్వామి, రఘునాథపల్లి మండలంలో మిర్యాల దేవేందర్, ఎల్.జయకృష్ణ, పి.చంద్రయ్య, ఎ.పవన్‌కుమార్, డాక్టర్ పి.రవీందర్, తరిగొప్పుల మండలంలో జి.జోసెఫ్ బేబీ, జె.ఎల్లయ్య, టి.బయ్యన్న, వి.జయేందర్, జె.సునిత, జఫర్‌గఢ్ మండలంలో వి.శ్రీనివాస్, ఎస్.కుమార్, పి.మనోహర్ స్వామి, ఆర్.కిరణ్‌కుమార్, టి.సుధాకర్ ఉన్నారు.

తేలుకాటుకు మహిళ మృతి



లావణ్య (ఫైల్‌ఫోటో)

మద్దూరు/బచ్చన్నపేట సెప్టెంబరు 4: తేలు కాటుకు గురై చికిత్స పొందుతూ మహిళ మృతి చెందింది. ఈ సంఘటన మద్దూరు మండలంలోని సలాఖ్‌పూర్‌లో మంగళవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాల మేరకు జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కొడ్వటూర్ గ్రామానికి చెందిన దండుగుల లావణ్య(26) సిద్దిపేట జిల్లా మద్దూరు మండలం సలాఖ్‌పూర్ గ్రామంలోని ఓ రైతు వ్యవసాయం భూమిలో పత్తి కలుపు తీయడానికి ఆటోలో పలువురు కూలీలతో కలిసి వెళ్లింది. పత్తి చేనులో కలుపు తీస్తుండగా ప్రమాదవశాత్తు తేలు కాటు వేసింది. తోటి కూలీలు తేలుకాటు గురైన లావణ్యను మద్దూరులోని పీహెచ్‌సీకి తీసుకురాగా ప్రాథమిక చికిత్స అనంతరం చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. పరిస్థితి సీరియస్‌గా మారడంతో సిద్దిపేటలో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. భర్త దండుగుల మహిపాల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.